# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జ జనం
జనం రిపోర్టర్
జన శ్రేయస్సే మా బాధ్యత

సంపుటి : 02 సంచిక : 22, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజిలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం -21- మే - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## బైడెన్ క్యాన్సర్ ను ఇన్ని రోజులు ఎందుకు బయటపెట్టలేదు?: ట్రంప్

బైడెన్ క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యంపై ట్రంప్ ప్రశ్నలు



గ్లీసన్ స్కోరు 9 చాలా తీవ్రం, ఎందుకు దాచారని ప్రశ్న

ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశమన్న ట్రంప్

## ఇండియాలో పెరుగుతున్న కరోనా
## జేఎన్.1 కేసులు... వ్యాధి లక్షణాలు ఇవే!

- పెరుగుతున్న కరోనా కేసులతో భారత్ లో ఆందోళన



- నిన్నటికి దేశ వ్యాప్తంగా 257 యాక్టివ్ కేసులు
- కొత్త వేరియంట్ కు వేగంగా వ్యాపించే సామర్థ్యం ఉందంటున్న నిపుణులు

## మరోసారి గొప్పలు చెప్పుకున్న పాక్ ప్రధాని...
## ఐఎన్ఎస్ విక్రాంత్ పై దాడి చేశారట!

ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ కు బుద్ధి చెప్పిన భారత్



అబద్ధాలతో పాక్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న ఆ దేశ పీఎం

పాక్ దాడిలో ఐఎన్ఎస్ విక్రాంత్ కు తీవ్ర నష్టం కలిగిందని వ్యాఖ్య



## పేర్లు రాసిపెట్టుకోండి... సినిమా చూపిస్తాం

### మరోసారి వార్నింగ్ ఇచ్చిన జగన్

★కూటమి ప్రభుత్వం, అధికారులకు జగన్ తీవ్ర హెచ్చరిక

అమరావతి: వైసీపీ అధినేత జగన్ మరోసారి కూటమి ప్రభుత్వం, కొందరు అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్యాయాలకు పాల్పడే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, సమయం వచ్చినప్పుడు కచ్చితంగా "సినిమా చూపిస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస ప్రభుత్వం

మిగతా.. 2లో

## రోహింగ్యాల వలసలతో పెను ముప్పు

➤రోహింగ్యాల వలసలతో నిరుద్యోగం, అంతర్గత భద్రతకు ముప్పు: పవన్

➤వారికి ఆధార్, ఓటరు, రేషన్ కార్డుల జారీపై తీవ్ర ఆందోళన

అమరావతి: రోహింగ్యాల అక్రమ వలసలు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తీవ్రతరం చేయడమే కాకుండా, దేశ అంతర్గత భద్రతకు కూడా పెను ప్రమాదంగా పరిణమిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు ప్రభుత్వ యంత్రాంగంలోని వ్యక్తుల సహకారంతోనే రోహింగ్యాలు ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారని, వారికి సులభంగా ఆధార్, ఓటరు, రేషన్ కార్డులు కూడా అందుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. గన్నవరం ఎయిర్ పోర్టులో పవన్ కల్యాణ్ ఇవాళ జాతీయ మీడియాతో మాట్లాడారు. గతంలో, ముఖ్యంగా 2017-18 సంవత్సరాల మధ్యకాలంలో, పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా నుంచి పెద్ద సంఖ్యలో రోహింగ్యాలు బంగారం పని నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు వలస వచ్చారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. మయన్మార్‌కు చెందిన ఈ రోహింగ్యాల వలసల వల్ల స్థానిక యువత తీవ్రంగా నష్టపోతోందని, వారికి దక్కాల్సిన ఉద్యోగావకాశాలు చేజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో స్థానికులకే ఉద్యోగాలు దక్కాలన్నది ఎప్పటినుంచో ఉన్న ప్రధాన డిమాండ్. తెలంగాణ ఉద్యమంలోనూ ఇది కీలక నినాదం. కానీ, దేశ సరిహద్దులు దాటి వచ్చిన



రోహింగ్యాలు ఇక్కడే తిష్టవేసి, మన యువత ఉపాధిని దెబ్బతీస్తున్నారు" అని పవన్ పేర్కొన్నారు. వారికి మన దేశంలో స్థిరపడేందుకు అవసరమైన గుర్తింపు కార్డులు ఎలా లభిస్తున్నాయన్న దానిపై ఆయన తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. "మన వ్యవస్థలోని కొందరు వ్యక్తులు

మిగతా.. 2లో

# ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన ..

## అధికారుల గుండెల్లో గుబులు

- జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు చేస్తానని పేర్కొన్న సీఎం చంద్రబాబు
- ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందేనని వెల్లడి
- ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలని సూచన



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుతున్న రేషన్, దీపం, ఏపీఎస్ఆర్టీసీ, పంచాయతీ సేవలపై వెల్లడైన ప్రజాభిప్రాయాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు నిన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఎంవో కార్యదర్శులతో సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తుందని, అన్ని శాఖల్లో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయి సంతృప్తి కనిపించాలని సీఎం అన్నారు. కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని, అయితే ఆర్టీసీ వంటి చోట్ల ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందని సీఎం అన్నారు. దీపం 2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఏడాదికి ఇచ్చే 3 సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని సీఎం అన్నారు.

మిగతా.. 2లో

## లేడీ కాదు కిలేడీ...
## 7 నెలల్లో 25 మందిని పెళ్లాడిన మహిళ



పెళ్లి చేసుకుని వరుడిని దోచుకోవడం, పారిపోవడమే పని

అందర్ కవర్ ఆపరేషన్ తో భోపాల్ లో అరెస్టు చేసిన పోలీసులు

పెళ్లిళ్ల రాకెట్ లో సభ్యులారిని గుర్తించినట్లు వెల్లడి

## కేసీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌కు నోటీసులు!

- నోటీసులు జారీ చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- వివరణ ఇచ్చేందుకు 15 రోజుల గడువు
- నిర్దిష్ట తేదీలను కూడా కమిషన్ ఖరారు
- కేసీఆర్ జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలి



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు విచారణ కమిషన్ నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. కేసీఆర్‌తో పాటు, ఆయన ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన హరీశ్ రావు, బీజేపీ ఎంపీగా ఉన్న ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ నోటీసులు పంపింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై వివరణ ఇచ్చేందుకు ఈ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న 15 రోజుల్లోగా కమిషన్ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆదేశించింది. ఇందుకోసం నిర్దిష్ట తేదీలను కూడా కమిషన్ ఖరారు చేసింది. కేసీఆర్ జూన్ 5వ

మిగతా.. 2లో

## నిజాన్ని నిర్భయంగా చెప్పడం ప్రకాశం పంతులు నైజం

- టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతికి మంత్రి లోకేశ్ నివాళి
- ఆంధ్ర రాష్ట్ర తొలి సీఎంగా ప్రగతికి బాటలు వేశారన్న లోకేశ్
- ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి చేశారని కితాబు
- స్వాతంత్ర్య ఉద్యమం, స్వరాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని వెల్లడి
- ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఉద్ఘాటన



అమరావతి: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ప్రకాశం పంతులు సేవలను, ఆశయాలను ఈ సందర్భంగా లోకేశ్

మిగతా.. 2లో

# నెలకు రూ.2 వేల కోట్లు ఖర్చుచేయనున్న ప్రభుత్వం




➤ 5 లక్షల మందికి 'యువవికాసం'

➤ జూన్ 2న మంజూరు పత్రాల పంపిణీ

➤ 3 నెలల్లో యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని లక్ష్యం

హైదరాబాద్: నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి కోసం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువవికాసం పథకం కింద తొలిఏడాది 5 లక్షల మందికి మంజూరుపత్రాలు జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీటిని పంపిణీ చేయాలని, 3 నెలల్లో నెలకు రూ.2 వేల కోట్లు చొప్పున ఖర్చుచేసి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని భావిస్తోంది. ఈ పథకం కింద ఇప్పటికే జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 25 నాటికి జిల్లా మంత్రుల అనుమతితో లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేసేందుకు సంక్షేమశాఖలు సిద్ధమయ్యాయి. క్షేత్రస్థాయి పరిశీలన..

మిగతా.. 2లో

**కార్పొరేషన్లవారీగా లక్ష్యాలు.. దరఖాస్తులు**

| కార్పొరేషన్ | యూనిట్ల లక్ష్యం | వచ్చిన దరఖాస్తులు |
|---|---|---|
| ఎస్సీ | 1.44 లక్షలు | 3.92 లక్షలు |
| ఎస్టీ | 91 వేలు | 1.83 లక్షలు |
| బీసీ | 1.55 లక్షలు | 8.01 లక్షలు |
| ఈబీసీ | 51 వేలు | 37 వేలు |
| మైనార్టీ | 45 వేలు | 2.04 లక్షలు |
| క్రిస్టియన్ మైనార్టీ | 5 వేలు | 4,600 |



## పాతబస్తీ అగ్నిప్రమాదంపై ఉన్నతస్థాయి దర్యాప్తు...
## ఆరుగురు అధికారులతో కమిటీ

- పాతబస్తీ అగ్నిప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వ దర్యాప్తు
- 17 మంది మృతి చెందిన ఘటనపై ఆరుగురు సభ్యుల కమిటీ
- ప్రమాద కారణాలు, సహాయ చర్యలపై నివేదిక కోరిన ప్రభుత్వం
- భవిష్యత్తులో నివారణ చర్యలపైనా సూచనలు చేయనున్న కమిటీ
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో కమిటీ ఏర్పాటు

మిగతా.. 2లో

## ముందుగానే వచ్చేస్తున్న నైరుతి రుతుపవనాలు...

నాలుగు రోజుల్లో కేరళలోకి ఎంట్రీ



- ప్రస్తుతం అండమాన్, శ్రీలంకలో విస్తరించిన రుతుపవనాలు
- సుమారు 10 రోజుల ముందుగానే కేరళను తాకనున్న వైనం
- జులై 8 నాటికి దేశమంతా విస్తరిస్తాయన్న అధికారులు

## తిరుమల లో యాంటీ డ్రోన్ టెక్నాలజీ

- అన్యమతస్తులను బదిలీ, భక్తుల కోసం ఇక- పాలక మండలి కీలక నిర్ణయాలు..!!



- స్విమ్స్ ఆస్పత్రిలో ఖాళీలను భర్తీ చేయటంతో పాటుగా టీటీడీ ఉద్యోగుల పదోన్నతుల పైనా చర్చ

మిగతా.. 2లో

## కేసీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌కు నోటీసులు!

మొదటి పేజి తరువాయి

కేసీఆర్ జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ తన నోటీసులో స్పష్టం చేసింది. అలాగే, కేసీఆర్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన హరీశ్ రావు జూన్ 6వ తేదీన, ఆర్థిక మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ జూన్ 9వ తేదీన విచారణకు హాజరు కావాలని కమిషన్ పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కూడా విచారణ జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్, నీటి పారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరానికి తగిన విధంగా కమిషన్ గడువును ఏడుమార్లు పొడిగించింది.

## పేర్లు రాసిపెట్టుకోండి... సినిమా చూపిస్తాం

మొదటి పేజి తరువాయి

వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస ప్రభుత్వం నడుస్తోందని జగన్ ఆరోపించారు. "కలియుగంలో రాజకీయాలు చేయాలంటే భయం ఉండకూడదు. కేసులకు, జైళ్లకు బెదిరిపోకూడదు. అలా అయితేనే రాజకీయాలు చేయగలం. చంద్రబాబు చేస్తున్న రాజకీయాలు ఆ విధంగానే ఉన్నాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తున్నారని, ముఖ్యంగా స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోందని దుయ్యబట్టారు. తిరువూరు వంటి ప్రాంతాల్లో వైసీపీకి సంఖ్యాబలం ఉన్నప్పటికీ, టీడీపీ పోటీకి దిగడం, వైసీపీ ఆధిక్యం ఉంటే ఎన్నికలను నిలిపివేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైసీపీ వారిని అరెస్టులు చేస్తూ, టీడీపీ వారిని వదిలేస్తున్నారని విమర్శించారు. "మీరు ఏ పుస్తకంలోనైనా పేర్లు రాసుకోండి. అన్యాయం చేయాలనుకుంటే చేయమనండి, కొడతానంటే కొట్టమనండి. కానీ, మాకూ సమయం వస్తుంది. అప్పుడు అన్యాయాలు చేసిన ప్రతి ఒక్కరికీ సినిమా చూపిస్తాం. రిటైర్ అయిన వారిని కూడా లాక్కొచ్చి తీరుతాం. దేశం విడిచి పారిపోయినా రప్పిస్తాం" అని జగన్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. చంద్రబాబు నాటిన విత్తనాలే ప్రస్తుత పరిస్థితులకు కారణమని, మహిళలని కూడా చూడకుండా నెలల తరబడి జైళ్లలో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక కేసులో బెయిల్ వస్తే, వెంటనే మరో కేసు నమోదు చేస్తున్నారని, వల్లభనేని వంశీ విషయంలోనూ ఇలాగే వ్యవహరించారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడైన నందిగం సురేష్‌ను కూడా అన్యాయంగా నెలన్నరకు పైగా జైల్లో ఉంచి, బయటకు వచ్చిన తర్వాత మళ్లీ కేసు పెట్టి జైలుకు పంపారని మండిపడ్డారు. రేపు కచ్చితంగా వైసీపీ కార్యకర్తే నంబర్ వన్ అవుతాడని, కార్యకర్తలకు అండగా నిలబడతామని ఆయన భరోసా ఇచ్చారు. అన్యాయాలకు పాల్పడిన వారికి తగిన శాస్తి తప్పదని పునరుద్ఘాటించారు.

## ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన ..

మొదటి పేజి తరువాయి

కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని, అయితే ఆర్టీసీ వంటి చోట్ల ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందని సీఎం అన్నారు. దీపం 2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఏడాదికి ఇచ్చే 3 సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని సీఎం అన్నారు. లబ్ధిదారులు తమకు కావలసినప్పుడు దీపం పథకం కింద సిలిండర్ పొందవచ్చు, అయితే వారికి మూడు సిలిండర్లకు ఇచ్చే మొత్తాన్ని ప్రభుత్వం ముందుగానే చెల్లిస్తుందన్నారు. రేషన్ సరుకుల పంపిణీపై అభిప్రాయాలు పరిశీలిస్తే, "మీరు ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా?" అని ప్రశ్నించగా 74 శాతం మంది అవునని, వాటి నాణ్యత ఎలా ఉంది అంటే బాగుందని 76 శాతం మంది చెప్పారన్నారు. రేషన్ పంపిణీలో, నాణ్యతపై ప్రజల సంతృప్తిలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. అదే విధంగా గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే అంశంలో 62 శాతం మంది లేదని, పలు చోట్ల ఈ విషయంలో సమస్య ఉందని చెప్పారన్నారు. ఆర్టీసీ సేవల విషయంలో ప్రయాణికుల నుంచి ఆశించిన స్థాయిలో సంతృప్తి వ్యక్తం కాలేదని, ఈ విషయంలో అధికారులు మరింత ప్రభావవంతంగా పనిచేయాలని సీఎం ఆదేశించారు. బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ విషయంలో ప్రయాణికుల నుంచి అసంతృప్తి వస్తోందని దీన్ని సరిచేసుకోవాలని సీఎం సూచించారు. తాగునీటిపై 44 శాతం, టాయిలెట్లపై 55 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు . ఇక పంచాయతీ సేవల విషయానికి వచ్చేసరికి, ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే ప్రశ్నకు 60 శాతం మంది అవుననే చెప్పారని, గతంతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ మెరుగైందని సీఎం అన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు తడిచెత్త నిర్వహణ బాధ్యత అప్పగించి, కంపోస్ట్ తయారీ చేపడతామని సీఎం తెలిపారు. ప్రభుత్వ సేవల్లో డాటా అనలిటిక్స్ కీలకమని సీఎం అన్నారు. డాటా ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖలు తమ పనితీరును క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సమర్థవంతంగా విశ్లేషిస్తే ప్రభుత్వ సేవల్లో అనూహ్య మార్పులు తేవచ్చన్నారు. ఒక ప్రభుత్వ పథకం లేదా కార్యక్రమంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్న సందర్భంలో వాటికి కారణాలను తెలుసుకుని దానికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రతి శాఖలో ఉన్నతాధికారులు ఆయా శాఖలపై వచ్చే డాటాపై అనలిటిక్స్ ద్వారా సేవలను మెరుగుపరచాలని సీఎం సూచించారు. ఇదంతా బాగానే ఉన్నా జూన్ 12 నుంచి ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్లు సీఎం ప్రకటించడంతో అధికారుల గుండెల్లో ఇప్పటి నుంచే గుబులు రేగుతోందని అంటున్నారు. ముఖ్యమంత్రి ఆకస్మిక పర్యటనలకు వచ్చిన సమయంలో ప్రజలు నేరుగా అధికారులపై ఫిర్యాదు చేసే అవకాశాలు ఉండటంతో వారిలో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

## ఇండియాలో పెరుగుతున్న కరోనా
## జేఎన్.1 కేసులు... వ్యాధి లక్షణాలు ఇవే!

ఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ స్వల్పంగా పుంజుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మే 19 నాటికి దేశవ్యాప్తంగా 257 యాక్టివ్ కొవిడ్ కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ పరిణామంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు, వ్యాధి వ్యాప్తి తీరుతెన్నులపై నిశితంగా దృష్టి సారించారు. ఇప్పటికే హాంకాంగ్, సింగపూర్ వంటి దేశాల్లో కొవిడ్ కేసులు పెరుగుతుండటం గమనార్హం. ప్రస్తుతం మన దేశంలో కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. అయితే, హాంకాంగ్, సింగపూర్‌లలో కొవిడ్ విజృంభణకు ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 అనే కరోనా వేరియంట్లు కారణమని నిపుణులు తేల్చారు. ఈ రెండు వేరియంట్లు కూడా జేఎన్.1 అనే మరో కొత్త వేరియంట్ నుంచి ఉద్భవించినవే కావడం గమనార్హం.

జేఎన్.1 వేరియంట్ అంటే ఏమిటి?

ఒమిక్రాన్ బీఏ.2.86 వేరియంట్ నుంచి జేఎన్.1 వేరియంట్ పుట్టుకొచ్చింది. దీన్ని తొలిసారిగా 2023 ఆగస్టు నెలలో గుర్తించారు. గతంలో వచ్చిన వేరియంట్లతో పోలిస్తే, ఒకటి, రెండు అదనపు జన్యు ఉత్పరివర్తనాల (మ్యూటేషన్లు) కారణంగా ఈ వేరియంట్‌కు వేగంగా వ్యాపించే సామర్థ్యం ఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల, ఇది శరీరంలోని రోగనిరోధక శక్తిని సులభంగా ఛేదించి ఇన్‌ఫెక్షన్ కలుగజేస్తుంది. "బీఏ.2.86 వేరియంట్‌తో పోల్చినప్పుడు జేఎన్.1లో ఒక మ్యూటేషన్ అదనంగా ఉంది. ఈ మార్పు, వేరియంట్‌లోని స్పైక్ ప్రొటీన్‌లలో స్వల్ప మార్పులకు కారణమవుతుంది. ఫలితంగా ఇది రోగనిరోధక శక్తి కంచెను దాటుకుని ఇన్ఫెక్ట్ చేయగలుగుతోంది" అని యేల్ యూనివర్సిటీ పరిశోధకులు వివరించారు.

జేఎన్.1 వేరియంట్ సోకిన వారికి ఉండే లక్షణాలు:

జేఎన్.1 వేరియంట్ సోకిన వారిలో సాధారణంగా పొడి దగ్గు, రుచి కోల్పోవడం, తలనొప్పి, ముక్కు దిబ్బడ, తీవ్రమైన అలసట, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా, ఈ వేరియంట్ బారిన పడిన కొందరిలో డయేరియా (విరేచనాలు) కూడా ఎక్కువగా కనిపిస్తోందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, ప్రస్తుతం భారత్‌లో పరిస్థితి నిలకడగానే ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిన్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) నేతృత్వంలో కొవిడ్ పరిస్థితిని సమీక్షించేందుకు ఉన్నతస్థాయి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెల్లడైన వివరాల ప్రకారం, నమోదవుతున్న కేసుల్లో వ్యాధి లక్షణాలు చాలా వరకు ఓ మోస్తరుగానే ఉన్నాయని, బాధితులు ఆసుపత్రిలో చేరాల్సినంత తీవ్రత లేదని విశ్వసనీయ వర్గాలు తెలియజేశాయి. అయినప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొవిడ్ నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## తిరుమల లో యాంటీ డ్రోన్ టెక్నాలజీ

తిరుపతి: టీటీడీ పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసారు. స్విమ్స్ ఆస్పత్రిలో ఖాళీలను భర్తీ చేయటంతో పాటుగా టీటీడీ ఉద్యోగుల పదోన్నతుల పైనా చర్చ చేసారు. టీటీడీలో పని చేస్తున్న అన్యమతస్థుల బదిలీలు.. వీర్ఎస్ దిశగా కసరత్తు చేయాలని డిసైడ్ అయ్యారు. ఒంటిమిట్ట ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభించనున్నారు. ఇక, తిరుమల లో యాంటీ డ్రోన్ టెక్నాలజీ వినియోగించాలని డిసైడ్ అయ్యారు. టీటీడీ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఈవో శ్యామల రావు వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తిరుమల కొండల్లో ఉన్న పచ్చదనాన్నిఅటవీశాఖ ద్వారా 68.14 శాతం నుండి 80 శాతానికి పెంచేందుకు నిర్ణయించారు. ప్రభుత్వ ఆమోదం వచ్చాక దశలవారీగా 2025-26 సంవత్సరంలో రూ.1.74కోట్లు, 2026-27 సంవత్సరంలో రూ.1.13కోట్లు, 2027 -28 సంవత్సరానికి రూ.1.13కోట్లు ప్రభుత్వ అటవీశాఖకు విడుదల చేసేందుకు బోర్డు నిర్ణయం తీసుకుంది. ?తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి వేంకటేశ్వర స్వామి ఆలయం, నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలతీర్థం కపిలేశ్వర స్వామి ఆలయం, నాగాలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయాల అభివృద్ధి కోసం సమగ్ర బృహత్ ప్రణాళిక తయారు చేసేందుకు ఆర్కిటెక్ట్ ల నుండి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయించారు. తిరుమలలోని విశ్రాంత భవనాల పేర్లు మార్పులో మిగిలిన ఇద్దరు దాతలు స్పందించలేదు. దీంతో ఈ విశ్రాంతి గృహాల పేర్లను టీటీడీనే మార్పు చేయాలని నిర్ణయం. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు విషయంలో వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఈవో వెల్ల డించారు. ?తిరుమలలోని బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల లైసెన్సు ఫీజును నిర్ణయించే అంశంపై ఆమోదం. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరొందిన సంస్థలకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ?ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాలను భక్తులు విశేష సంఖ్యలో సందర్శిస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. ?రాయలసీమకే తలమానికంగా ఉంటూ ఎందరో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కి ఆర్థిక సహాయంగా ఏడాదికి ఇప్పుడు అందిస్తున్న రూ.60కోట్లతో పాటు అదనంగా మరో రూ.71 కోట్లు అందించేందుకు ఆమోదం తెలిపారు. స్విమ్స్ మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సు లు, పారా మెడికల్ సిబ్బంది నియామకం చేపట్టేందుకు నిర్ణయం. అదేవిధంగా 85శాతం నిర్మాణా లు పూర్తి చేసుకున్న భవంతులను (అంకాలజీ మరియు పద్మావతి చిన్ని పిల్లల ఆసుపత్రిలతో కలిపి) త్వరలోనే మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొ చ్చేలా నిర్ణయం. శ్రీవారి వైద్య సేవను కూడా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకు న్నారు. ?టీటీడీలో పని చేస్తున్న అన్యమతస్తులను బదిలీ చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు, స్వచ్ఛంద పదవీ విరమణకు చర్యలు తీసుకునేందుకు ఆమోదం తెలిపారు. ?తిరుమల ఆలయ భద్రతను దృష్టిలో పెట్టుకుని యాంటీ డ్రోన్ టెక్నాలజీ వాడాలని నిర్ణయించారు. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ?ఒంటిమిట్టలో భక్తులకు అన్నదానం సేవలను మరింత పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. అమరావతి ఆలయం అభివృద్ధి కోసం ర చేయాలని నిర్ణయం. ఇందుకు రూ.10 కోట్లు కేటాయింపుకు ఆమోదించారు. ?శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన డీడీ నెక్స్ట్ లెవల్ చిత్ర బృందం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

# రోహింగ్యాల వలసలతో పెను ముప్పు

మొదటి పేజి తరువాయి




"మన వ్యవస్థలోని కొందరు వ్యక్తులు వారికి సహకరించడం వల్లే ఇది సాధ్యమవుతోంది. దీనిపై లోతైన విచారణ జరగాలి. రోహింగ్యాలు మన పౌరులుగా మారి, మన అవకాశాలను ఎలా కొల్లగొడుతున్నారనే దానిపై ప్రజల్లో చైతన్యం రావాలి," అని ఆయన అన్నారు. ఈ వలసల వల్ల కేవలం నిరుద్యోగమే కాకుండా, అంతర్గత భద్రతకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రోహింగ్యాలు స్థానికులుగా మారడానికి సహకరిస్తున్న యంత్రాంగంపై కఠిన నిఘా ఉంచాలని, అంతర్గత భద్రత విషయంలో మరిన్ని పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా తాను పోలీసు ఉన్నతాధికారులకు లేఖ కూడా రాసినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించి, తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

### వాళ్ల కంటే మిన్నగా పోలీసులు
### అప్రమత్తంగా ఉండాలి: పవన్ కళ్యాణ్

దేశ సరిహద్దుల్లో సైనికులు ఎంతటి అప్రమత్తతతో విధులు నిర్వర్తిస్తారో, రాష్ట్రంలో అంతర్గత భద్రత విషయంలో పోలీసులు కూడా అంతే జాగరూకతతో వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు ఉగ్రవాదులకు సున్నితమైన లక్ష్యంగా మారాయని, ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని, పరిపాలన సిబ్బందిని అప్రమత్తం చేస్తూ తాను లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో కోయంబత్తూరు, హైదరాబాద్‌లలో జరిగిన ఉగ్రవాద దాడులను ప్రస్తావిస్తూ, ఆ సంఘటనలు తలచుకుంటే ఇప్పటికీ గుండె తరుక్కుపోతుందని పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో ఉగ్రవాదుల జాడలు కనిపించిన నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని డీజీపీ గారిని లేఖ ద్వారా కోరాను. పాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని ఉగ్రవాద జాడలున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించాను" అని పవన్ వివరించారు. ముఖ్యంగా వలస వచ్చే వారి విషయంలో సరైన నిఘా ఉంచడం ద్వారా సంభవించబోయే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, తీర ప్రాంతంలో కూడా నిరంతర పర్యవేక్షణ, నిఘాను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. "గతంలో కాకినాడలో బయట వ్యక్తులు బోట్లలో వచ్చినట్లు కొన్ని వార్తలు వచ్చాయి. తీరంలో కొత్త వ్యక్తుల కదలికలు, వారి కార్యకలాపాలను నిశితంగా గమనించాలి. పోలీసులు అజాగ్రత్తగా ఉండకుండా అంతర్గత భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి" అని ఆయన హితవు పలికారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రాష్ట్రంలో కొన్ని ఉగ్రవాద జాడలు కనిపించినట్లు తెలిసిందని, ఈ పరిణామాల దృష్ట్యా నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు. అంతర్గత భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని పోలీసులకు ఆయన విజ్ఞప్తి చేశారు.




# నెలకు రూ.2 వేల కోట్లు ఖర్చుచేయనున్న ప్రభుత్వం

మొదటి పేజి తరువాయి

క్షేత్రస్థాయి పరిశీలన.. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 16.20 లక్షల దరఖాస్తులొచ్చాయి. లక్ష్యం మేరకు ఇందులో దాదాపు 5 లక్షల మంది యువతకు గరిష్ఠంగా రూ.4 లక్షల విలువైన యూనిట్లు మంజూరు చేయనున్నారు. యూనిట్ కేటగిరీలవారీగా వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం అంచనా వేసింది. రూ.లక్ష లోపు రుణాల కోసం నిర్దేశించిన లక్ష్యం కన్నా దరఖాస్తులు తక్కువగా, రూ.1-2 లక్షలు, రూ.2-4 లక్షల యూనిట్ల కేటగిరీ రుణాలకు భారీగా దరఖాస్తులు వచ్చినట్లు గుర్తించింది. ఉదాహరణకు ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.2-4 లక్షల విలువైన యూనిట్లు 20 వేలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే.. దాదాపు 3.24 లక్షల మంది పోటీపడుతున్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ కింద 22 వేల యూనిట్ల కోసం 6.66 లక్షల మంది, ఈబీసీల్లో 8 వేల యూనిట్ల కోసం 32 వేల మంది దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయి కమిటీలు పనిచేస్తున్నాయి.

అనర్హులకు అడ్డుకట్ట..

దరఖాస్తుదారుల్లో అనర్హులను తొలగించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఒకసారి సంక్షేమ కార్పొరేషన్ పరిధిలో లబ్ధి పొందినవారు ఐదేళ్లపాటు మరోసారి రుణం పొందేందుకు అనర్హులవుతారు. సంక్షేమ కార్పొరేషన్ల వద్ద ఉన్న డేటాబేస్‌తో దరఖాస్తులను పరిశీలించి అనర్హులను తొలగిస్తున్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతా వివరాలను ఆధార్ డేటాబేస్‌తో పరిశీలించి, సరైన ఖాతాలు ఇచ్చారా.. లేదా.. పరిశీలిస్తున్నారు. మండలాలు, జిల్లాలు, మున్సిపాలిటీలు, నగరపాలికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీల జనాభా ఆధారంగా యూనిట్ల ఖరారుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కుటుంబానికి ఒక్కరికే స్వయంఉపాధి పథకం మంజూరు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

## మరోసారి గొప్పలు చెప్పుకున్న పాక్ ప్రధాని...
## ఐఎన్ఎస్ విక్రాంత్ పై దాడి చేశారట!

ఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్ కు గట్టి బుద్ధి చెప్పినప్పటికీ, పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మాత్రం తమ దేశ ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలకు తెరలేపారు. భారత్‌పై విజయం సాధించామంటూ, ముఖ్యంగా భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ విక్రాంత్‌ను ధ్వంసం చేశామని ఆయన చెప్పిన మాటలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. కరాచీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న షెహబాజ్ షరీఫ్... పాక్ నావికాదళం, వైమానిక దళాలను ప్రశంసిస్తూ గొప్పలు చెప్పుకున్నారు. "భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ విక్రాంత్ పాకిస్థాన్ సరిహద్దులకు సమీపంగా, కేవలం 400 నాటికల్ మైళ్ల దూరంలోకి వచ్చింది. అయితే, మన వైమానిక దళం విక్రాంత్‌పై దాడి చేసి తీవ్ర నష్టం కలిగించింది. మన దెబ్బకు ఐఎన్ఎస్ విక్రాంత్ వెనక్కి భారత్ వైపు పారిపోయింది" అంటూ షెహబాజ్ షరీఫ్ పచ్చి అబద్ధాలు చెప్పారు.

## బైడెన్ క్యాన్సర్ ను ఇన్ని రోజులు
## ఎందుకు బయటపెట్టలేదు?: ట్రంప్

అమెరికా: అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు ప్రోస్టేట్ క్యాన్సర్ సోకినట్లు వెల్లడైన విషయం తెలిసిందే. అయితే, ఈ రోగ నిర్ధారణ విషయాన్ని ఆలస్యంగా బయటపెట్టడంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు కీలక ప్రశ్నలు లేవనెత్తారు. బైడెన్ ఆరోగ్యం గురించి ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. జో బైడెన్‌కు ప్రోస్టేట్ క్యాన్సర్ ఉన్నట్లు ఆయన కార్యాలయం ఆదివారం అధికారికంగా ప్రకటించింది. గ్లీసన్ స్కోరింగ్ విధానంలో ఆయన క్యాన్సర్ తీవ్రతను అంచనా వేయగా, స్కోరు 9గా నిర్ధారణ అయినట్లు తెలిపారు. ఈ స్కోరు క్యాన్సర్ వేగంగా వ్యాపించే అవకాశాన్ని సూచిస్తుంది. ఈ పరిణామాలపై డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "బైడెన్‌కు క్యాన్సర్ సోకిందన్న విషయం ఇన్ని రోజుల తర్వాత తెలియడం నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. గ్లీసన్ స్కోరు 9కి చేరుకోవడానికి చాలా సమయం పడుతుంది. గతంలో ఇదే వైద్యుడు బైడెన్ మానసికంగా ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ఇది కేవలం రాజకీయ అంశం కాదు, మన దేశ భద్రతకు సంబంధించిన విషయం. క్యాన్సర్ విషయాన్ని ఇప్పటివరకు ఎందుకు బయటకు వెల్లడించలేదు? ప్రజలకు దీని గురించి పూర్తి వాస్తవాలు తెలియాలి. కొందరు నిజాలు చెప్పడం లేదు, ఇది మరో పెద్ద సమస్యగా మారుతోంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మరోవైపు, జో బైడెన్ భార్య జిల్ బైడెన్‌పై డొనాల్డ్ ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ తీవ్ర విమర్శలు చేశారు. జిల్ బైడెన్ ఒక "నకిలీ వైద్యురాలు" అంటూ ఆయన ఆరోపించారు. డాక్టర్ అయినప్పటికీ తన భర్తలో క్యాన్సర్ లక్షణాలను గుర్తించలేకపోవడంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తప్పుపట్టారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

## లేడీ కాదు కిలేడీ...
### 7 నెలల్లో 25 మందిని పెళ్లాడిన మహిళ

ఢిల్లీ: వయసు పైబడుతున్నా వివాహం కాని యువకులను టార్గెట్ చేసి, పెళ్లి చేసుకుని విలువైన వస్తువులతో ఉడాయిస్తున్న మహిళను రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేశారు. నగలు, నగదుతో కొత్త పెళ్లికూతురు పారిపోయిందని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో అండర్ కవర్ ఆపరేషన్ చేపట్టి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సోమవారం భోపాల్‌లో సవాయ్ మాధోపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆ మహిళ కేవలం 7 నెలల వ్యవధిలోనే 25 మంది యువకులను ఇదేవిధంగా మోసం చేసిందని బయటపడింది. మహిళ వెనకున్న పెళ్లిళ్ల రాకెట్ ను ఛేదించిన పోలీసులు.. నిందితురాలిని అరెస్టు చేసి ఆమె గ్యాంగ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ కు చెందిన అనురాధ పాశ్వాన్ (23) గతంలో ఓ ఆసుపత్రిలో పనిచేసింది. భర్తతో గొడవల కారణంగా విడాకులు తీసుకున్న అనురాధ.. ఆ తర్వాత మధ్యప్రదేశ్ కు మకాం మార్చింది. భోపాల్ లో నివసిస్తూ ఓ పెళ్లిళ్ల రాకెట్ తో చేతులు కలిపింది. పెళ్లి కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న యువకులను ఈ ముఠా సభ్యులు లక్ష్యంగా చేసుకునేవారు. సంబంధం కుదిర్చిపెడతామని చెప్పి భారీగా కమీషన్ వసూలు చేసి అనురాధ ఫొటో చూపించేవారు. ఆపై చట్టబద్ధంగా వివాహం జరిపించేవారు. ఆ తర్వాత అనురాధ కొద్దిరోజులు అత్తారింట్లో ఉండి, వీలు చిక్కగానే బంగారం, నగదు, ఎలక్ట్రానిక్ వస్తువులతో రాత్రికి రాత్రే ఉడాయించేది. ఇలా వివిధ రాష్ట్రాల్లో 7 నెలల్లో 25 మందిని మోసం చేసింది. సవాయ్ మాధోపూర్‌కు చెందిన విష్ణు శర్మ అనే వ్యక్తి మే 3న ఇచ్చిన ఫిర్యాదుతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. సునీత, పప్పు మీనా అనే ఇద్దరు ఏజెంట్లకు రూ.2 లక్షలు చెల్లించి అనురాధతో పెళ్లి సంబంధం కుదుర్చుకున్నానని, ఏప్రిల్ 20న స్థానిక కోర్టులో వివాహం చేసుకున్నానని విష్ణు శర్మ చెప్పాడు. అయితే, ఇంట్లోని విలువైన వస్తువులతో అనురాధ మే 2న పారిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు ఒక కానిస్టేబుల్‌ను పెళ్లికొడుకుగా నమ్మించి పంపారు. ఏజెంట్ తో సంప్రదింపులు జరపగా.. అనురాధ ఫొటో పంపించాడు. ప్రత్యక్షంగా కలిసి మాట్లాడాలని చిరునామా తీసుకున్న కానిస్టేబుల్.. ఆ వివరాలను ఉన్నతాధికారులకు అందించాడు. దీంతో పోలీసులు రెయిడ్ చేసి అనురాధను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠాలో రోష్ని, రఘుబీర్, గోలు, మజ్‌బూత్ సింగ్ యాదవ్, అర్జున్ అనే మరికొందరు నిందితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

## పాతబస్తీ అగ్నిప్రమాదంపై
## ఉన్నతస్థాయి దర్యాప్తు...
### ఆరుగురు అధికారులతో కమిటీ

హైదరాబాద్: హైదరాబాద్‌లోని చారిత్రక చార్మినార్ సమీపంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. ఈ దుర్ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రమాదానికి గల కారణాలను లోతుగా విచారించేందుకు, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు సూచించేందుకు ఆరుగురు సీనియర్ అధికారులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఈ కమిటీ వివరాలను వెల్లడించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, సహాయక చర్యల్లో వివిధ శాఖల పనితీరుపై ఈ కమిటీ నిశితంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. అంతేకాకుండా, ఇలాంటి ప్రమాదాలను నివారించడానికి తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలను కూడా సూచించాలని కమిటీని కోరారు. ఈ కమిటీలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్, ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఎ.వి. రంగనాథ్, తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎస్పీడీసీఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ సభ్యులుగా ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, సమగ్ర దర్యాప్తు జరపాలని ఆదేశించారు. ఇలాంటి అగ్నిప్రమాదాలు మళ్లీ జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలని ఆయన నొక్కి చెప్పారు. కమిటీ నివేదిక అందిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటారు. కాగా, గుల్జార్ హౌస్ చౌరస్తా సమీపంలోని ఒక భవనంలో ఈ అగ్నిప్రమాదం జరిగింది. కింది అంతస్తులో దుకాణాలు ఉండగా, పై రెండు అంతస్తుల్లో వ్యాపారి కుటుంబం నివసిస్తోంది. ప్రమాదం జరిగిన రోజే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. సోమవారం మృతుల కుటుంబాలను పరామర్శించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇంత పెద్ద దుర్ఘటన జరిగినా ముఖ్యమంత్రి ఘటనా స్థలాన్ని సందర్శించకపోవడం, సమీక్ష నిర్వహించకపోవడంపై విమర్శలు చేశారు.

## ముందుగానే వచ్చేస్తున్న నైరుతి రుతుపవనాలు...
### నాలుగు రోజుల్లో కేరళలోకి ఎంట్రీ

ఢిల్లీ: దేశ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) చల్లని కబురు అందించింది. మరో నాలుగైదు రోజుల్లోనే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వార్తతో ఉపశమనం లభించనుంది. భారత వాతావరణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం, నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం శ్రీలంక, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఇవి చురుగ్గా కదులుతూ, రాబోయే నాలుగు లేదా ఐదు రోజుల్లో కేరళ రాష్ట్రంలో ప్రవేశించేందుకు అన్ని అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఐఎండీ అధికారులు తెలిపారు. సాధారణంగా జూన్ మొదటి వారంలో కేరళను తాకే రుతుపవనాలు, ఈ ఏడాది మే నెలాఖరులోనే పలకరించనున్నాయి. రుతుపవనాల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామని, ఇవి జులై 8వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా విస్తరిస్తాయని అంచనా వేస్తున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఈ ఏడాది రుతుపవనాల ఆగమనం ముందుగానే ఉండటంతో, వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి వర్షాలు సరైన సమయంలో కురిస్తే పంటలకు మేలు జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నిజాన్ని నిర్భయంగా చెప్పడం
## ప్రకాశం పంతులు నైజం

మొదటి పేజి తరువాయి

ప్రకాశం పంతులు సేవలను, ఆశయాలను ఈ సందర్భంగా లోకేశ్ స్మరించుకున్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర ప్రగతికి విశేషమైన బాటలు వేశారని పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రకాశం పంతులు నిరంతరం శ్రమించారని కొనియాడారు. సమాజంలో జరిగే అన్యాయాన్ని ధైర్యంగా ఎదిరించడం, వాస్తవాలను నిర్భయంగా వెల్లడించడం టంగుటూరి ప్రకాశం పంతులు గారి సహజ లక్షణాలని లోకేశ్ కీర్తించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ, ఆంధ్ర రాష్ట్ర సాధనలోనూ ఆయన అత్యంత కీలకమైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రకాశం పంతులు గారి జీవితం, ఆయన ఆచరించిన విలువలు నేటి యువతరానికి గొప్ప స్ఫూర్తినిస్తాయని మంత్రి లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఆయన నిర్దేశించిన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## పవర్ లిఫ్టర్ మోడెం వంశీకి 80000 ఆర్థిక సహాయం అందించిన భద్రాచలం ఐఎంఏ లో ఉన్న డాక్టర్లు భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కోచ్ జి వి రామిరెడ్డి




ఎటపాక ( జనం రిపోర్టర్ ): ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మోడెం వంశీకి భద్రాచలం ఐఎంఏ లో ఉన్న డాక్టర్లు అందరూ కలిసి 80 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి మానవత్వం చాటుకున్నారు. విషయానికొస్తే మే 5వ తారీకు నుండీ 12వ తారీకు వరకు ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ లో జరిగిన అంతర్జాతీయ ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో మోడెం వంశి ఇరవై దేశాలతో పోటీపడి, మన





భారతదేశానికి బంగారు పతకాలు సాధించడమే కాకుండా, స్ట్రాంగ్ మెన్ టైటిల్ని కూడా సాధించడం జరిగింది. ఇది వరకు గెలుచుకున్న రెండూ అంతర్జాతీయ పోటీల పతకాలు తో బాటుగా ఇప్పుడు గెలుచుకున్నది మూడోవ అంతర్జాతీయ పోటీల పతకాలు. అయితే ఈ పోటీలకు, ఎంపికైన క్రీడాకారుడు పవర్ లిఫ్టింగ్ ఆఫ్ ఇండియాకు ఎంట్రీ ఫీజు నిమిత్తం 80,000 రూపాయలు చెల్లించవలసి ఉండగా, నిరుపేద గిరిజనుడు అయిన మోడెం వంశీ కి భద్రాచలంలోని ఐఎంఏ లో ఉన్న డాక్టర్లు అందరూ కలిసి ఈ ఫీజు మొత్తాన్ని చెల్లించడం జరిగింది. గతంలో కూడా డాక్టర్లందరూ కలిసి మోడెం వంశీని సౌత్ ఆఫ్రికా సన్ సిటీ లో జరిగిన పోటీలకు వెళ్లేటప్పుడు కూడా ఇబ్బంది పడుతున్న విషయాన్నీ గుర్తించి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. మోడెం వంశీ కి సహాయం చేసిన భద్రాచలం ఐఎంఏ లో ఉన్న డాక్టర్లు అందరి పట్ల భద్రాచలం ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మోడెం వంశీ మాట్లాడుతూ నాకు సహాయం అందించిన ప్రతి ఒక్కరికి ఎప్పటికీ రుణపడి ఉంటానని ఈ సందర్భంగా తెలియజేశారు . అంతేకాకుండా భద్రాద్రి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులైన భోగాల శ్రీనివాస్ రెడ్డి, జీవీ రామిరెడ్డి, డాక్టర్ కృష్ణ ప్రసాద్, మహంతి వెంకటకృష్ణాజీ , గుగులోతు శోభన్ నాయక్ ల సహకారం వల్లనే తను ఈ విజయాలు సాధిస్తున్నట్లు తెలిపారు.

## రాజ్ భవన్ లో దొంగలు పడ్డారు!



సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, హైదరాబాద్, మే20 : ( జనం రిపోర్టర్ ) : నిత్యం కట్టుదిట్టమైన భద్రతలో ఉండే రాజ్ భవన్ లోనే చేతివాటం చూపించాడు ఓ జాదు గాడు, హైదరాబాద్ నడి ఒడ్డున గల తెలంగాణ అధికారిక నివాసం రాజ్ భవన్ లో కొద్ది రోజుల క్రితం ఈ దొంగతనం జరిగినట్టు తెలుస్తుంది, ఇప్పుడు ఈ ఘటన రాష్ట్రంలో సంచ లనం చోటుచేసుకుంది.. గవర్నర్ అధికార నివాసం లోకి దర్జాగా వెళ్లిన ఓ వ్యక్తి.. మొదటి అంతస్తులో ఉన్న కంప్యూటర్ రూమ్ లోకి చొరబడి నాలుగు హార్డ్ డిస్కులు ఎత్తుకెళ్లాడు. ఈ నెల 13న ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. రాజ్‌భవన్‌లోని సుధర్మ భవన్‌లో కొన్ని కంప్యూటర్ల నుంచి నాలుగు హార్డ్ డిస్కులు కనిపించకుండా పోయిన విషయాన్ని అధికారులు ఆలస్యంగా గుర్తించారు. దీనిపై వారు వెంటనే పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజ్‌భవన్ వంటి అత్యంత భద్రత ఉండే ప్రదేశంలో ఈ తరహా ఘటన జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదు అందుకున్న పంజాగుట్ట పోలీసులు వెంటనే రంగంలోకి దిగి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో భాగంగా ఈ చోరీకి పాల్పడింది, రాజ్‌భవన్‌లో ఔట్సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ హార్డ్వేర్ ఇంజనీర్ గా పనిచేసే శ్రీనివాస్ గా పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిసింది. అనంతరం శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ హార్డ్ డిస్కులలో ఏ విధమైన సమాచారం ఉందనే విష యంపై స్పష్టత రావాల్సి ఉంది.

## కార్మికులకు ప్రమాదమైన లేబర్ కోడ్స్నుఅమలుచేయవద్దని...



రేపల్లె ( జనం రిపోర్టర్ ): కార్మికులకు ప్రమాదమైన లేబర్ కోడ్స్నుఅమలుచేయవద్దని...కనీస వేతనాలు ఇవ్వాలి,ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు సిఐటియు నిరసనలి...దేశవ్యాప్తంగా లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ ఈరోజు నిరసనలో భాగంగా రేపల్లె బస్టాండ్ సెంటర్ వద్ద సిఐటియు నిరసన తెలియజేయడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూలి కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చడంకోసం ప్రమాద భరితమైన 4 లేబర్ కోడ్లను అమలు చేయటానికి ప్రయత్నిస్తున్నది. ఈ లేబర్ కోడ్స్ అమలుఅయితే స్వాతంత్రం పూర్వం నుండి కార్మికులకు అమలువుతున్న సమ్మెహక్కు, 8 గంటల పనివిధానం,పిఎఫ్,ఈఎస్ఐ, కనీస వేతనాలు,పరిశ్రమల్లో కార్మికశాఖ అధికారుల పర్యటనలు రద్దువుతాయి. కావున కార్మికులను బానిసలుగా మార్చే కార్మికచట్టాలను అమలు చేస్తే చూస్తూ ఊరుకోమని డిమాండ్ చేశారు,అదేవిధంగా దేశంలో కార్మికవర్గం, రైతాంగం,సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం దేశవ్యాప్త సమ్మెకు కార్మికవర్గం సిద్ధమైనది,ప్రస్తుత దేశంలో ఉన్న పరిస్థితుల్లో సమ్మెను జూలై 9 కి వాయిదా వేసినట్లు భవిష్యత్తులో దేశవ్యాప్త కార్మికవర్గాన్ని కలుపుకొని కార్మికహక్కులనుకాపాడుకోవడానికి పెద్దఎత్తున ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులుకె.ఆశీర్వాదం,కె.రమేష్,అంగన్వాడీ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కే.ఝాన్సీ,మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రేపల్లె పట్టణ అధ్యక్షులు డి.ప్రభాకరరావు,రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులుఎం.వెంకటేశ్వరరావు,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు వై.వాసు,పి.విజయ్, కే.వెంకటేశ్వరరావు,ఆర్టీసీ హైర్ బస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు వివిధ రంగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# యూట్యూబర్ జ్యోతి నుంచి విద్యార్థి దేవేంద్ర వరకు.. 11 మందిపై దేశ ద్రోహం కేసు..

, సిటీ ఇంచార్జ్ అనిల్ కుమార్, హైదరాబాద్, మే20 : ( జనం రిపోర్టర్ ): తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లు.. తమ స్వార్థం కోసం తల్లిలాంటి దేశానికి ద్రోహం చేస్తున్న వాళ్లు ఎక్కువయిపోయారు. యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో మొదలుపెడితే.. ఇప్పటి వరకు పాక్ కోసం పని చేస్తున్నట్లు భావిస్తున్న 11 మంది గూఢాచారులు బయటపడ్డారు. భారత్, పాక్ యుద్ధం తర్వాత పోలీసులు, నిఘా వర్గాలు, ఇతర అధికారుల చేతికి వీరు చిక్కారు. వీరంతా హర్యానా, పంజాబ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు కావటం గమనార్హం. ఆ 11 మంది గురించిన వివరాల్లోకి వెళితే..




### 1) జ్యోతి మల్హోత్రా :

జ్యోతి మల్హోత్రాది హర్యానాలోని హిసర్. 33 ఏళ్ళ జ్యోతికి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ట్రావెలింగ్ వీడియోలు చేస్తూ ఉంటుంది. యూట్యూబ్‌లో ట్రావెల్ విత్ జో పేరిట ఛానల్ ఉంది. ఢిల్లీలోని పాకిస్తాన్ హై కమిషన్‌కు చెందిన డానిష్ అనే ఉద్యోగితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో పాకిస్తాన్ కోసం గూఢాచారిగా పని చేయటం మొదలెట్టింది.

### 2) దేవేంద్ర సింగ్ దిల్హాన్ :

పంజాబ్‌లోని మస్తఘర్‌కు చెందిన దేవేంద్ర సింగ్ దిల్హాన్ పాటియాల లోని ఖల్సా కాలేజీలో ఎమ్ఏ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. కొన్నేళ్ల క్రితం ఇతడికి పాకిస్తాన్ ఇంటెలిజెన్స్, ఐఎస్ఐలతో పరిచయం అయింది. అప్పటినుంచి భారత్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్నాడు. మే 12వ తేదీన తన ఫేస్‌బుక్ ఖాతాలో పిస్టోళ్లు, గన్నుల ఫొటోలు పెట్టి అరెస్ట్ అయ్యాడు. పోలీసుల విచారణలో పాకిస్తాన్ కోసం పని చేసినట్లు ఒప్పుకున్నాడు.

### 3) తారిఖ్ :

తారిఖ్‌ది హర్యానాలోని కంగర్కా గ్రామం. పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తున్నాడన్న కారణంతో హర్యానా పోలీసులు, కేంద్ర నిఘా వర్గాలు సంయుక్తంగా కలిసి అతడ్ని అదుపులోకి తీసుకున్నాయి.

### 4) అర్మన్ :

23 ఏళ్ల అర్మన్ భారత్, పాకిస్తాన్ యుద్ధం సమయంలో భారత దేశానికి సంబంధించిన విషయాలను పాకిస్తాన్‌కు చేరవేశాడు. హర్యానాలోని నోహ్‌లో ఇతడ్ని అరెస్ట్ చేశారు.

### 5) నౌమన్ ఇల్లహి :

24 ఏళ్ల నౌమన్ ఇల్లహిది ఉత్తర ప్రదేశ్‌లోని కైరానా. నౌమన్ హర్యానాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఇతడు పాకిస్తాన్ ఐఎస్ఐతో సంబంధం పెట్టుకున్నాడు. పాకిస్తాన్‌కు సమాచారం అందించిన ప్రతీసారి డబ్బులు వచ్చేవి. అవి అతడి బావ మరిది అకౌంట్‌లో పడేవి.

### 6) షహజాద్ :

ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన షహజాద్ పాకిస్తాన్, భారత్ సరిహద్దు ప్రాంతాల్లో వస్తువుల్ని అక్రమ రావాణా చేస్తుంటాడు. పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీతో సంబంధం పెట్టుకున్నాడు. నిన్న కూడా దేశానికి సంబంధించిన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేశాడు. దీంతో ఉత్తర ప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అతడ్ని అరెస్ట్ చేసింది.

### 7) మహ్మద్ ముర్తాజా అలీ :

మహ్మద్ ముర్తాజా అలీ పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐతో కలిసి పని చేస్తున్నాడు. పాకిస్తాన్ కోసం పని చేయటం కోసం ఏకంగా ఓ మొబైల్ యాప్‌ను తయారు చేశాడు. గుజరాత్ పోలీసులు ఇతడ్ని అరెస్ట్ చేశారు.

### 8) గజాలా :

పంజాబ్‌కు చెందిన ఈమె పాకిస్తాన్‌కు డబ్బులు చేరవేస్తూ ఉండేది. ఈమెది పంజాబ్‌లోని మలెర్‌కోట్ల.

### 9) యామిన్ మహ్మద్ :

పాకిస్తాన్ ఇతడ్ని విభిన్నమైన పనులు చేయడానికి ఎంపిక చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పంజాబ్ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు.

### 10) సుఖ్‌ప్రీత్ సింగ్ :

పంజాబ్లోని గుర్‌దాస్‌పూర్‌కు చెందిన సుఖ్‌ప్రీత్ సింగ్‌ను పాకిస్తాన్ కోసం గూఢాచారిగా పని చేస్తున్నట్లు గుర్తించారు. పంజాబ్ పోలీసులు ఇతడ్ని అరెస్ట్ చేశారు.

### 11) కరన్‌బీర్ సింగ్ :

పంజాబ్‌కు చెందిన కరన్‌బీర్ సింగ్‌కు నేరుగా ఐఎస్ఐతోటే సంబంధాలు ఉన్నాయి. ఇతడు భారత ఆర్మీకి చెందిన కీలక సమాచారాన్ని ఐఎస్ఐకి చేరవేసినట్లు తేలింది. పంజాబ్ పోలీసులు గుర్‌దాసపూర్‌లో ఇతడ్ని అరెస్ట్ చేశారు.

# వికారాబాద్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యం..!!

## నకిలీ విత్తనాల అమ్మకాలపైన ప్రత్యేక దృష్టి

## జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఐపీఎస్..!!




వికారాబాద్ జిల్లా ప్రతినిధి: ( జనం రిపోర్టర్ ): వికారాబాద్ జిల్లా మున్సిపల్ పరిధిలో ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారంపోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్లలో నమోదు అవుతున్న కేసులు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మరియు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంపై సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్ కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి సత్వర పరిష్కారానికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఎస్పీ జారీ చేసిన ముఖ్య ఆదేశాలు మరియు సూచనలు: కేసుల సత్వర పరిష్కారం: పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత కాలపరిమితిలో పూర్తి



చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా, పాత కేసుల పురోగతిని సమీక్షించి, ఛార్జిషీట్లు దాఖలు చేయడంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణ: జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మరియు ఆత్మహత్యల వెనుక గల కారణాలను లోతుగా విశ్లేషించి, వాటిని తగ్గించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు తరచుగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ కళాజాత బృందాలచే ప్రజలకు ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అక్రమ రవాణాపై ఉక్కుపాదం: ఇసుక, గుట్కా, మరియు ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) బియ్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘాను మరింత పటిష్టం చేయాలన్నారు. సీసీటీవీల ప్రాముఖ్యతపై అవగాహన నేరాల నియంత్రణ మరియు దర్యాప్తులో సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని, వారి నివాసాలు మరియు వ్యాపార సంస్థల వద్ద స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. వారం చివరిలో ప్రత్యేక డ్రైవ్‌లు: వారాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని గుర్తించడానికి (డ్రంక్ డ్రైవ్), బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని (ఓపెన్ బుజింగ్) నిరోధించడానికి, మరియు అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌లు ముమ్మరంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ-పెట్టి కేసులపై ప్రత్యేక దృష్టి: ఈ-పెట్టి కేసుల నమోదు మరియు దర్యాప్తుపై ప్రత్యేక నిఘా ఉంచాలని, బాధితులకు తక్షణ న్యాయం అందేలా చూడాలని సూచించారు. కోర్ట్ మానిటరింగ్ మరియు కన్విక్షన్ రేటు: కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్‌ను సమర్థవంతంగా పర్యవేక్షించాలని, కేసులలో నేరస్తులకు శిక్ష పడే శాతాన్ని (కన్విక్షన్ రేటు) గణనీయంగా పెంచడానికి కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాసిక్యూషన్‌తో సమన్వయం చేసుకుంటూ, సాక్ష్యాధారాలను పకడ్బందీగా కోర్టు ముందు ఉంచాలన్నారు. మహిళల భద్రతకు పెద్దపీట: మహిళలు మరియు బాలికలపై జరిగే నేరాల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలని, నిందితులపై తక్షణమే కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. షీ టీమ్స్ పనితీరును మరింత మెరుగుపరిచి, మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలన్నారు. నకిలీ విత్తనాలపై పోలీస్ అధికారులు దృష్టి సరించాలి: ముఖ్యంగా రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాకుండా నిరోధించడానికి కఠినమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం కింద చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. నకిలీ విత్తనాల సరఫరా మరియు అమ్మకాలను అరికట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఎరువులు మరియు విత్తనాల దుకాణాలపై దాడులు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తక్కువ ధరకు విత్తనాలు ఇస్తామని చెప్పే వారిని నమ్మవద్దని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని రైతులకు సూచించారు. ఈ విధంగా, నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఎస్పీ గారు తెలియజేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక నిఘా: త్వరలో రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, ముఖ్యంగా పశువుల అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి, ప్రజల సహకారంతో పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు శ్రీ టివి హనుమంత్ రావు ,వికారాబాద్,పరిగి,తాండూర్ మరియు డిసిఆర్‌బి డీఎస్పీలు, జిల్లా సీఐలు,జిల్లా ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కిషోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్



రేపల్లె ( జనం రిపోర్టర్ ): బాపట్ల జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో రేపల్లె ఐసీడీస్ ప్రాజెక్ట్ నందు ఈ రోజు కిషోరి వికాసం సమ్మర్ కాంపెయిన్ ను అన్ని గ్రామాలలో నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఆడపిల్లల పట్ల లింగ వివక్షమరియుఅసమానతలు గురుంచి చర్చింటం జరిగింది. వేగంగా పెరిగే సమాజంలో లింగ వివక్ష కనబడుతుంది: ఇది ఆడవారిపై అణచివేత, హింస, అసమాన అవకాశాల రూపంలో ఉంటుంది అని లింగ ధర్మాలను మనం సామాజికంగా నేర్చుకుంటాంలింగ సమానత్వాన్ని గుర్తించి, అనుసరించాలి వివక్షను ఎదుర్కొనే ధైర్యం కలిగి ఉండాలి కుటుంబం మరియు సమాజంలో సమానతకు సహకరించాలి అని వివరించటం జరిగింది. ఈ రోజు మున్సిపాలిటీ నందు గల 8,9 వార్డ్ అంగన్వాడీ నందు పాల్గొనటం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఎం సుచిత్ర సూపర్వైజర్ శివ జ్యోతి మహిళా సంరక్షణ కార్యదర్శి బి హరిత ఆశా వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు తల్లులు కిషోర్ బాలికలు పాల్గొన్నారు

## చిగురుమామిడి బస్టాండ్ అవరణం లో ఆశ కార్యకర్త ల భిక్షాటన




చిగురుమామిడి (జనం రిపోర్టర్ ): ఈరోజు దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా చిగురుమామిడి బస్టాండ్ ఆవరణంలో 4 లేబర్ కోడ్స్ అమలు అయితే కార్మికులు బిక్షం ఎత్తుకునే పరిస్థితి వస్తుందనిభిక్షాటన చేసి నిరసన తెలియజేయడం జరిగిందిఈ నిరసన కార్యక్రమానికి ఆశ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరెల్ల శ్రీలత హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటుకరణ ఆపాలని, ఆశ కార్యకర్త లకు స్థిర వేతనం 26000 ఇవ్వాలని, ఆశలను 3తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, 45 ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని,4 వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ నాలుగు లేబర్ కోట్లు అమలు అయితే కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా, పనిగంటలు 8 గంటల నుంచి 12 గంటల వరకు పెంచారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకరణ ఆపాలని, స్కీము బడ్జెట్ పెంచాలని లేకుంటే పోరాటాన్ని ఉదృతం చేస్తామని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బెజ్జంకి సరోజాన బండారు సరోజన,పుష్ప, అంజలి, కవిత, తార, శ్వేత, సాహిద బేగం మంజుల, తిరుమల, తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయులకు వృత్యాంతర శిక్షణ తరగతులు ప్రారంభించిన

# తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : తాండూరు మండలానికి సంబంధించిన ఎస్ జి టి ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్యాలను పెంపొందించే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన 5 రోజుల శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఈ



సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ శిక్షణ సమయంలో నేర్చుకున్న అన్ని అంశాలను విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించాలి.ప్రభుత్వ పాఠశాలపై ప్రజలకు పూర్తి నమ్మకం ఏర్పడే విధంగా పని చేయాలి.మారుతున్న టెక్నాలజీలని దృష్టిలో ఉంచుకొని అధునాతన పద్ధతుల ద్వారా విద్యార్థులకు నైపుణ్యం పెంచే విధంగా ఉపాధ్యాయులు బోధించాలి.ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాలపై ఆరా తీసి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ..



పొన్నూరు ( జనం రిపోర్టర్ ) : గుంటూరు జిల్లా పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కమిషనర్ రమేష్ బాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పట్టణంలో కూటమి శ్రేణులతో పాటు మీడియా ప్రతినిధులు, వ్యాపార ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థ సేవ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపి నిండు నూరేళ్లు వర్ధిల్లాలని కోరారు. అతి తక్కువ కాలంలోనే పొన్నూరు పురపాలక సంఘంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పారిశుధ్య కార్యక్రమాలు, త్రాగునీటి ,డ్రైనేజీ,ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ పురపాలక సంఘ ప్రజల మన్నాలను పొందిన ఏకైక కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు అని కొనియాడారు. పూర్తికాల పదవి నీ పొన్నూరులో గడపాలని మరిన్ని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.పట్టణంలో పలువురు కార్యాలయంలో కలిసి శాలువా పుష్పగుచ్చాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## తరాల నుంచి సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలివ్వాలి

## తెలంగాణ వ్యవసాయ

## కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు



వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : తల తరాలుగా సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ మంగళవారం ఖిల్లా ఘనాపూర్ మండలం కేంద్రం మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణలో మాట్లాడుతూ, షాపూర్ , మామిడి మాడ రెవెన్యూ శివారులో ఐదు, ఆరు తరాల నుంచి 8 గిరిజన తాండా వాసులు దాదాపుగా 480 ఎకరాల పైబడి భూములను సాగు చేస్తూ వస్తున్నారు. పాలక ప్రభుత్వాలు మారినా వీరి చేతుల్లోకి భూపట్టాలు నేటికి రాలేదు. అనేక దఫాలుగా భూ పంపిణీలు, భూ సీలింగ్ చట్టాలు వచ్చినా, సాగు చేస్తున్న గిరిజన కుటుంబాలకు మాత్రం భూముల పట్టాలు రాలేదు.ఈ భూములు తప్ప ఇతర ఆధార భూములు ఏమీ లేవు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూభారతి ద్వారానైనా భూ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది.భూపట్టాల సాధన కమిటీ కన్వీనర్ సక్రు నాయక్ తెలంగాణ గిరిజన సంఘం మరియు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శులు బాల్య నాయక్, ఎం ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికైనా పాలక ప్రభుత్వము చొరవ తీసుకొని గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వడానికి తక్షణమే ముందుకు రావాలని డిమాండ్ చేయడం జరిగింది.లేనియెడల రెండు సంఘాలు భూ పట్టాల సాధన కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక ఆందోళన పోరాటాలకు గిరిజన రైతులను సిద్ధం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

## గోదాముల్లో ధాన్యం

## బస్తాలను త్వరగా అన్లోడ్ చేసుకోవాలి కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఆత్మకూరు వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : గోదాముకు, రైస్ మిల్లు కు వచ్చిన వడ్ల లారీలను త్వరగా దింపుకొని పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.మంగళవారం ఆత్మకూరు మండలోని లక్ష్మీ ఆగ్రో టెక్ గోదాము, రైస్ మిల్లును కలెక్టర్ సందర్శించారు. గోదాము ముందు వడ్ల లోడుతో నిలబడి ఉన్న 7-8 లారిలను చూసిన కలెక్టర్ త్వరగా దించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, హమాలీల సంఖ్యను పెంచాల్సిందిగా ఆదేశించారు. అనంతరం వచ్చిన వడ్ల నుండి ఎంత శాతం బియ్యం వస్తుంది, తరుగు ఏమైనా తీస్తున్నారా అని ట్రక్ షీట్ రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వచ్చిన లారీలను త్వరగా పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని మిల్లరును ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆత్మకూరు, మండల అభివృదిఅధికారి కార్యాలయంలో ఆత్మకూరు, అమరచింత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ,ప్రత్యేక అధికారుల ద్వారా సర్వే చేసిన వివరాలను పరిశీలించారు. మొదటి విడతలో ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా గ్రౌండింగ్ చేయించాలని ఆదేశించారు.రెండవ విడతకు సంబంధించి స్క్రూటినీ పూర్తి చేసి కలెక్టర్ లాగిన్ కు పంపించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిలోనూ అర్హత



లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి వీలు లేదని, ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఒకే ఇంటి ముందు ఇద్దరు కంటే ఎక్కువ మంది ఫోటోలు దిగి పెట్టడం, ప్లాట్ ముందు ఫోటోలు దిగింపెట్టడం వంటివి గమనించడం జరిగిందని ఇలాంటి వారి పేర్లు సిఫారసు చేయవద్దని ఆదేశించారు తహసిల్దార్ చాంద్ పాషా,ఎంపీడీఓ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కేంద్ర బిజెపి ప్రభుత్వం

## అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి...

ఎన్టిపిసి కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 20. కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని, ఎన్టిపిసి కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం ఎన్టిపిసి కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో ఎన్టిపిసి ప్లాంట్ గేట్ 2 వద్ద కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన వ్యక్తం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ... కార్మికులకు నష్టదాయకమైన 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించి, అమలు చేయాలని డిమాండ్ చేశారు.జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె లో అన్ని రంగాల్లో ఉన్న కార్మిక వర్గం పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.నిరసన కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం నాయకులు భూమల్ల చందర్, నాంసాని శంకర్, చిలుక శంకర్, ఈ భూమయ్య, ఆర్ రాజ మల్లయ్య, గిట్ల లక్ష్మారెడ్డి, ఎండి జమీల్, సిహెచ్ సత్యం, ఏ శ్రీనివాస్, వెంకటేష్, దండ రాఘవరెడ్డి, జె. సమ్మిరెడ్డి, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యంలో

## రామగుండం రైల్వే డిపో వద్ద ప్లే కార్డ్స్ తో నిరసన.....





రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 20. రామగుండం రైల్వే డిపో వద్ద ప్లే కార్డ్స్ తో నిరసన. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా రామగుండం, డిపో వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ప్లే కార్డ్స్ తో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కేంద్రాల్లోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలను అనుసరిస్తూ, కార్మికులు పోరాడు సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చి కార్మిక హక్కుల్ని కాలరాచే విధంగా నాలుగు లేబర్ కోర్లను అమలు చేయుటకు సిద్ధపడింది, కార్మికులుసంఘం పెట్టుకోకుండా, సమ్మె హక్కు లేకుండా పనిగంటలు 8 నుండి 12 గ.పెంచే విధానాన్ని అమలు చేయచూస్తున్నది. ఇప్పటికే కనీస వేతనాలు,చట్టాలు అమలు కాక కార్మికులు గురవుతున్నారు, అంతేకాకుండాదేశ ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను బడా పెట్టుబడిదారులకు అమ్మకానికి పెడుతున్నది. 2020 విద్యుత్ చట్టం పేరుతో ప్రజలపై ప్రైవేటు వారి చేతిలో విద్యుత్ సంస్థను పెట్టచూస్తున్నది , ఐక్య పోరాటాలతో కార్మిక హక్కుల్ని ప్రజల ఆస్తుల్ని ఐక్య పోరాటాలతో కాపాడుకోవాలని అన్నారు.కనీస వేతనం 26,000 నిర్ణయించాలని నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ప్రభుత్వరంగసంస్థల ప్రైవేటీకన్నా నిలిపి వేయాలని, 2020 విద్యుత్ చట్ట సవరణ రద్దు చేయాలని, కనీస పెన్షన్ 9000 రూపాయలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.బిక్షపతి, గిట్ల. లక్ష్మారెడ్డి రైల్వే కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు కె.తిరుపతి, ఐ.మురళి, ఎస్. రాజమౌళి,బి. సతీష్, బి.శివ నాయక్, బి. రాజు, ఇష్తకార్, జి. సతీష్, లలు నాయక్ పాల్గొన్నారు .

# నగర పాలక సంస్థ, గుంటూరు



గుంటూరు ( జనం రిపోర్టర్ ) : నగరంలో రోడ్ల విస్తరణ సమయంలో స్థలాలని జిఎంసికి గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వారికి టిడిఆర్ బాండ్లు అందించడం జరుగుతుందని, అందని వారు నగరపాలక సంస్థ సిటి ప్లానర్ ని కలిసి వివరాలు అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ గారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ గుంటూరు నగరంలో అనేక ప్రాంతాల్లో అనగా డొంక రోడ్, కొత్తపేట, కుగ్లర్ హాస్పిటల్ రోడ్, ఏటి అగ్రహారం, పలకలూరు రోడ్, నందివెలుగు రోడ్, రామనామ క్షేత్రం రోడ్, జేకేసి కాలేజి రోడ్ తదితర రోడ్ల విస్తరణ పనులు చేపట్టామన్నారు. అందులో భాగంగా విస్తరణ ప్రభావిత భవన స్థల యజమానులకు టిడిఆర్ బాండ్లు అందిస్తామని, కాని కొందరు గతంలో విస్తరణ చేపట్టిన రోడ్లకు సంబంధించి బాండ్లు అందలేదని పిజిఆర్ఎస్, గ్రీవెన్స్ ల్లో అర్జీలు అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కనుక అటువంటి వారు కార్యాలయ సమయంలో నగరపాలక సంస్థ సిటి ప్లానర్ రాంబాబు (98499 08390) వారిని కలిసి తగిన వివరాలు అందిస్తే పరిశీలించి బాండ్లు అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# వెబ్ డెవలపర్ కోర్సులు ప్రారంభం



రేపల్లె. ( జనం రిపోర్టర్ ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాబివృద్ధి సంస్థ వారు బాపట్ల జిల్లా రేపల్లెలోని శ్రీ ఎబిఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్-రేపల్లె నందు ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్ నందు శనివారం నుండి వెబ్ డెవలపర్ కోర్సులను ప్రారంభించినారు మరియు అకౌంట్స్ అసిస్టెంట్ కోర్సును గురువారం నుండి తరగతులు నిర్వహించబడును . 3నెలల పాటు నిర్వహించు ఈ శిక్షణ కార్యక్రమములకు రిజిస్ట్రేషన్ ప్రారంచబడినవి. కావున ఆసక్తిగల అభ్యర్థుల నుండి ఈ శిక్షణ కార్యక్రమముల కొరకు దరఖాస్తులు స్వీకరించుచున్నారు అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. శ్రీ. టి. సి. రవి చంద్రకుమార్ ఒక ప్రకటనలో ప్రిన్సిపల్. డాక్టర్ టి సి రవిచంద్రకుమార్ తెలియజేశారునిరుద్యోగ అభ్యర్థులకు ఈ స్కిల్ హబ్ సెంటర్ నందు పరిశ్రమలకు అనుగుణంగా శిక్షణ అందించి అనంతరంవిజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకున్న అభ్యర్థులకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ(%చీూణజ%) మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ( ల వారి నుండి సర్టిఫికెట్ జారీ చేయబడునని మరియు అర్హతలను బట్టి అభ్యర్థులకు ఆయా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడునని తెలియచేసారు.ఈ శిక్షణ కోర్సులకు కనీస వయస్సు 18 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి మరియు ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ ఆపైన చదివి పాసైన/ఫెయిల్ అయిన పు/స్త్రీ అభ్యర్థులు ఈ శిక్షణా కార్యక్రమము నకు అర్హులు.కాల వ్యవధి:3నెలలు.రిజిస్ట్రేషన్ కొరకు క్రింద ఇవ్వబడిన లింక్ నందు అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకునవలెను.మరిన్ని వివరములకు ఫోన్ 9347468946 నెంబర్ ద్వారా తెలుసుకొనగలరు.

## గుంటూరు జి .జి .హెచ్ .లో

## మంచినీరు వృధా పట్టించుకోని అధికారులు




గుంటూరు( ( జనం రిపోర్టర్ ) : గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల అధికారుల నిర్లక్ష్యంజి.జి.హెచ్ ఎమర్జెన్సీ పోలీస్ అవుట్ పోస్ట్ పక్కన పార్కింగ్ ప్లేస్ లో ఉన్నటువంటి మంచినీటి పైప్ లైన్ లీకేజ్ వృధాగా పోతున్నటువంటి మంచినీరు పట్టించుకోని సిబ్బంది జి.జి.హెచ్ లో మంచినీటికి అవస్థలు పడుతున్న రోగులు వృధా అవుతున్న మంచినీరు మంచినీరు డ్రైనేజీ పాలో అవుతున్న పట్టించుకోని సిబ్బంది మరియు సూపరెంటెంట్ పర్యవేక్షణ లోపంతో వృధా అవుతున్నటువంటి మంచినీరు డ్రైనేజీ పాలు రోగుల అవసరాలకి మంచినీరు అందక అవస్థలు పడుతున్నటువంటి వైనం జి.జి.హెచ్ లో మంచినీటినీ పర్యవేక్షిస్తున్న చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మంచినీరు వృధా మంచినీరు వృధా అవుతుంటే పేషెంట్లు గగ్గోలు పెడుతున్నటువంటి పేషెంట్లు జి.జి. హెచ్ పరిసరాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నటువంటి కాంట్రాక్ట్ సిబ్బంది

## పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకే పదవులు:

# పిసిసి జనరల్ సెక్రెటరీ సంజీవ్



అమరచింత /ఆత్మకూర్: వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అన్యాయం చేయదని టీపీసీసీ జనరల్ సెక్రటరీ సంజీవ్, ముదిరాజ్ అన్నారు. మంగళవారం ఆయన అమరచింత ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రాలలో ఏర్పాటుచేసిన మండల కార్యకర్తల సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, నారాయణపేట వనపర్తి జిల్లాల అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ప్రశాంత్ కుమార్ రెడ్డి, టి పి సి సి కల్లుగీత డిపార్ట్మెంట్ సెల్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజీవ్ ముదిరాజ్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల, అధ్యక్ష కార్యదర్శుల మండల, పట్టణ అధ్యక్ష కార్యదర్శుల పదవులు అర్హులైన వారికి పార్టీ అభివృద్ధి కృషి చేసిన వారికి లభిస్తాయని తెలిపారు. పదవులు ఆశించే కార్యకర్తలు టిపిసిసి నుండి వచ్చిన అప్లికేషన్ ఫారాన్ని నింపి స్థానిక జిల్లా అధ్యక్షులకు ఇవ్వాలని కోరారు. సంవత్సర న్నర లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసినటువంటి అభివృద్ధి పనులను కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కోరారు. అమరచింత ఆత్మకూరు మండలాలకు ఇప్పటికే 700 కోట్ల రూపాయలను ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అదనపు స్కూల్ బిల్డింగులు, సిసి రోడ్లు, అంగన్వాడీ భవనాలు మహిళలకు ఉచిత బస్సు పేదలకు సన్న బియ్యం రాజీవ్ యువ వికాస్ వంటి సంక్షేమ కార్యక్రమాలకు మక్తల్ ఎమ్మెల్యే అధిక నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ప్రతిపక్షాల అసత్యపు ప్రచారాలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. అర్హులైన వారి పేర్లు టి పి సి సి నుండి ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయుబుఖాన్ మహిళా నాయకురాలు నాగలక్ష్మి కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి అరుణ్ కుమార్ మాజీ ఎంపిటిసి తిరుమలేష్ మహంకాళి విష్ణు పోసిరి గారి విష్ణు రాకేష్ గౌడ్ టాపిక్ పెద్ద బాలరాజు హనుమంతు నాయక్ తో పాటు మండలంలోని వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మున్సిపల్ కమిషనర్ కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువ..



పొన్నూరు మే 20. జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కమిషనర్ రమేష్ బాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పట్టణంలో కూటమి శ్రేణులతో పాటు మీడియా ప్రతినిధులు, వ్యాపార ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థ సేవ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపి నిండు నూరేళ్లు వర్ధిల్లాలని కోరారు. అతి తక్కువ కాలంలోనే పొన్నూరు పురపాలక సంఘంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పారిశుధ్య కార్యక్రమాలు, త్రాగునీటి ,డ్రైనేజీ,ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ పురపాలక సంఘ ప్రజల మన్నాలను పొందిన ఏకైక కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు అని కొనియాడారు. పూర్తికాల పదవి నీ పొన్నూరులో గడపాలని ప్రజా సమస్యలను మరిన్ని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.పట్టణంలో పలువురు కార్యాలయంలో కలిసి శాలువా పుష్పగుచ్చాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## అంతర్జాతీయ స్థాయి

## కరాటే పోటీలలో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన....



రామగుండంజనం రిపోర్టర్:రామగుండం:మే 20. అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన కనబరిచారని వీరికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన పెద్దపల్లి జిల్లా విద్యార్థినులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మే 17, 18 తేదీలలో ఉత్తరాఖండ్ హరిద్వార్ ఓకేనావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే 2025 పోటీలలో పెద్దపల్లి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని అన్నారు. అంతర్జాతీయ కరాటే 2025 పోటీలలో పెద్దపల్లి మహాత్మ జ్యోతిభా పూలే పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. అండర్ 14 కట్ ఆఫ్ కుమితి విభాగంలో 2 బంగారు పతకాలు, 3వెండి పతకాలు, 3 కాంస్య పతకాలు సాధించారని అన్నారు.అండర్ 14 కటాస్ కుమితి విభాగంలో టి. శరణ్య బంగారు వెండి, పతకం జి.కృష్ణవేణి బంగారు, కాస్య పథకం జీ.వైష్ణవి వెండి కాస్య పథకం టి రక్షిత వెండి కా కాస్య పథకం యు కీర్తన వెండి కాశ్యం పథకం సాధించడం జరిగిందని తెలిపారు.అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ కర్ర వెంకటేష్, ప్రిన్సిపాల్ మనిదీప్తి ఇన్స్పెక్టర్ అలేఖ్య విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు .

## సవరమ్మ జాతరలో పాల్గొన్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



అమరచింత /వనపర్తి జిల్లా ప్రతినిధి/జనం రిపోర్టర్:అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలో జరుగుతున్న సవరమ్మ జాతర బ్రహ్మోత్సవాలలో మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. సవరమ్మ తల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీపీసీసీ కల్లు గీత సెల్ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్ నాగరాజ్ గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్ వెంకటేశ్వర్ రెడ్డి కేజీ మహేందర్ రెడ్డి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## నైపుణ్య అభివృద్ధి శిక్షణతో ఉపాధి అవకాశాలు పెంపు.....
## త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ సర్వే నిర్వహణ....

సింగరేణి స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు....

రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మాత్యులు డి.శ్రీధర్ బాబు...




రామగుండం:జనం రిపోర్టర్:రామగుండం:మే 20. వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మాత్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు.మంగళవారం రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని ఎం.వి.టి.సి నందు సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ (నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం)ను రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ జె.అరుణశ్రీ, రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్ రావు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ నిరుద్యోగ యువతీ యువకులలో వృత్తి నైపుణ్యత పెంచి, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం వివిధ ఏరియాలలో ఇలాంటి శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తుందన్నారు. ఈ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా సుమారు 38 కోర్సులలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వబడుతుందని, అలాంటి శిక్షణా కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. శిక్షణ పొందే అభ్యర్థులు సర్టిఫికెట్ కోసమే కాకుండా, పూర్తిస్థాయిలో శిక్షణ పొంది నిజమైన నైపుణ్యాన్ని సాధించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందని అన్నారు. రాష్ట్రంలో త్వరలో స్కిల్ సర్వే నిర్వహించి, నిరుద్యోగులకు వివిధ విభాగాలలో ఉన్నటువంటి నైపుణ్యత ఆధారంగా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సింగరేణి యాజమాన్యం ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని ఒక కళాశాలగా అభివృద్ధి చేసి, ఇక్కడి నుండే నియామకాలు చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. సురేష్, హెచ్.ఆర్.డి. విభాగం జనరల్ మేనేజర్ గుంజపడుగు రఘుపతి, రామగుండం-1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కె.రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘ నాయకులు కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.నరసింహులు, ఎస్వోటుజిఎం బి.వి.సత్యనారాయణ, వివిధ గనుల,విభాగాల అధిపతులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాలువ పూడిక తవ్వకాల పన్నుల్లో డొల్లతనం.
## గత ప్రభుత్వంలో తవ్విన రూ. 26లక్షల తవ్వకాల్లోనూ చేతివాటం.

ప్రస్తుత తవ్వకాలపైనా వెల్లువెత్తుతున్న విమర్శలు.



నరసాపురం. మే 20 జనం రిపోర్టర్: రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు ప్రధాన కాలువలు కట్టి వదిలే లోపు కాలువ పూడిక ప్రక్షాళన పనులు చేయడం అనవాయితీ. నరసాపురం, మొగల్తూరు మండలాలు డెల్టా ప్రాంతం కావడంతో పంట కాలువలకు శివారు ప్రాంతాలుగా ఉన్నాయి. నిడదవోలు నుండి వచ్చే ప్రధాన కాలువ మొగల్తూరు వరకూ ప్రవహించి ఇక్కడ మిగులు నీరు ఉప్పుటేరులో లాకు ద్వారా కలుస్తోంది. మొగల్తూరు శివారు ప్రాంతం కావడంతో ఎగువ ప్రాంతాల నుండి తరచూ వచ్చే గుర్రపు డెక్క, తూడు, పాస్టిక్ వ్యర్థాలు, జంతు, మానవ మృత కళేభరాలు ఇక్కడ పేరుకుపోయి శివారున ఉన్న ప్రధాన కాలువ నీరు కలుషితం అవుతోంది. ఇదే నీటిని తీర గ్రామాల్లో సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ప్రధాన కాలువ శివారు ప్రాంతం మొగల్తూరులో తరచూ కాలుష్య కోరల్లో చిక్కుకుని పూడుకుపోతోంది. గతంలో అనేకమార్లు రైతులు. స్థానికులు ఆందోళన చేయగా గత ప్రభుత్వ హయాంలో కాలువ ప్రక్షాళనకు సుమారు రూ.26లక్షలు నిధులు మంజూరు కాగా ఆనిధులతో తూతూ మంత్రంగా పనులు ముగించి నాటి గుత్తేదారులు అధికారుల చేతివాటంతో పనులు మమ అనిపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనూ నరసాపురం మండలం సీతారామపురం నుండి మొగల్తూరు పాతకాలువ సమీపం వరకూ స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధుల నుండి రూ.14లక్షలు నిధులు మంజూరు కావడంతో సుమారు 4.5 కిలో మీటర్ల మేర చేపట్టిన కాలువ తవ్వకం పనులుపై అనుమానాలు వ్యక్తం చేసున్నారు. కేవలం కాలువ ఇరు పక్కలా గట్లు ఎక్కేస్తున్నారేగాని పలు చోట్ల గట్లు తవ్వడం లేదని, బెడ్ లెవెల్ తవ్వడం లేదని శివారుప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత తవ్వకాలును నూరుశాతం కాలువ లెవెల్స్ కు అనుగుణంగా తవ్వకుంటే రానున్న రోజుల్లో నీటి పారుదలకు ఇబ్బందులు తప్పవని శివారుకు నీరు అందే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు.కాలువ గట్లు జారిపడే అవకాశం.ప్రస్తుత తవ్వకాల్లో బాగంగా కాలువకు గల ఇరుపక్కలా గట్లు ఎక్కేస్తున్నారని అయితే కొద్దిపాటి వర్షానికే ఎక్కేసిన గట్లు కాలువలో జారిపడిపోయే అవకాశం ఉందని అలాకాకుండా బెడ్ లెవెల్ తవ్వకాలు నిబంధనలు పాటిస్తూ తవ్విన అనంతరమే గట్లు ఎక్కేసి చదును చేస్తే కనీసం కొంత కాలం ప్రయోజనం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురైన మొగల్తూరు ప్రధాన కాలువ తవ్వకాలకు మంజూరు చేసిననిధులను సక్రమంగా సద్వినియోగం చేయాలని మొగల్తూరు లాకు వరకూ కాలువ ప్రక్షాళన పనులు పూర్తి చేసే విధంగా నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలని మొగల్తూరు ప్రాంత రైతులు కోరుతున్నారు.

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ
# ఆధ్వర్యంలో మినీ మహానాడు



గుంటూరుజనం రిపోర్టర్ :గుంటూరు నగరంలోని తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాలయం నందు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమానికి హాజరై తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు సీనియర్ %మీ=% గారి విగ్రహానికి పూలమాలలు వేసి,నివాళులర్పించి,తదుపరి తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర గారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ గారు,వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్కి చెందిన తొలి జాబ్ టెక్ కంపెనీ 'టెక్గ్రాడ్స్'
## బ్రోచర్ ను విడుదల చేసిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ శంకర్పల్లి జనం రిపోర్టర్:శంకర్పల్లి మున్సిపాలిటీకి చెందిన కొత్తపల్లి రవీందర్ 14 సంవత్సరాల ఐటీ పరిశ్రమ అనుభవం తర్వాత తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఐటీ రంగం కోసం టెక్గ్రాడ్స్ అనే నూతన స్టార్టప్ను ఇటీవల స్థాపించారు. హైదరాబాద్కి చెందిన తొలి జాబ్ టెక్ కంపెనీ 'టెక్గ్రాడ్స్' బ్రోచర్ ను మంగళవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నగరంలోని ఆయన నివాసంలో విడుదల చేశారు. టెక్గ్రాడ్స్ వ్యవస్థాపకుడిని అభినందిస్తూ తన నియోజకవర్గం నుంచి వచ్చిన ఈ సామాజిక ప్రేరణతో కూడిన స్టార్టప్ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఎంపీ రవీందర్ ను ఆకాంక్షించారు. రవీందర్ మాట్లాడుతూ టెక్గ్రాడ్స్ లక్ష్యం డిగ్రీ, బీఈ., బీటెక్ విద్యార్థులు, ఐటీ ఆసక్తిగల అభ్యర్థులకు నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శనం, ఇంటర్న్షిప్స్, జాబ్ రెడీనెస్, టాప్ ఎంఎన్సీ కంపెనీల్లో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడం. ఈ సంస్థ విద్యా వ్యవస్థ, ఐటీ పరిశ్రమ మధ్య గల నైపుణ్య ఖాళీని పూడ్చేందుకు ఐటీ పరిశ్రమ నిపుణుల సహకారంతో ప్రత్యేకమైన ప్రోగ్రామ్స్ను రూపొందించింది. ఉద్యోగంలో ఉన్న ఐటీ నిపుణులకు కూడా తక్కువ సమయంలో కెరీర్ను అభివృద్ధి చేసుకునే విధంగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన ప్రోగ్రామ్లు అందిస్తున్నారు. టెక్గ్రాడ్స్ కేవలం ఉద్యోగం పొందడానికే కాకుండా, ఐటీ రంగంలో విజయవంతంగా ఎదగడానికి అవసరమైన సమగ్ర మద్దతును అందించే జాబ్ టెక్ ప్లాట్ఫార్మ్. ఈ సంస్థ సేవలను పొందదలచిన వారు వెబ్సైట్ లేదా మెయిల్ ఐడి ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

## కార్మిక, వ్యతిరేక లేబర్ కొడ్స్ ని రద్దు చేయాలి
## 8 గంటల పని దినాన్ని కాపాడుకుందాం
## అమరచింత లో కార్మిక సంఘాల రాస్తారోకో

జూన్ 9న జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కార్మికలోకాని ప్రజా సంఘాల నాయకుల పిలుపు




అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి జనం రిపోర్టర్: వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో సిఐటియు, పి యు సి ఐ, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘంల ఆధ్వర్యంలో అమరచింత మండల్ కేంద్రంలోని బస్టాండ్ దగ్గర రాస్తారోకో చేయడం జరిగింది.ఈ కార్యక్రమనికి అధ్యక్షతగా టి యు సి ఐనాయకులు ఎం ప్రభాకర్ వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ ఎన్ రమేష్, టి యు సి ఐ జిల్లా కోశాధికారి సి రాజు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్,రైతు సంఘం జిల్లా కోశాధికారి బి వెంకటేష్, అఖిల రైతు కూలీ సంఘ జిల్లా నాయకులు రాజన్న, ఏఐటీయూసీ జిల్లా నాయకులు శ్యామ్సుందర్ మాట్లాడుతూలి 8 గంటల పని దినాన్ని కార్మికులు పోరాటం నిర్వహించి తెచ్చుకుంటే, నరేంద్ర మోడీ ప్రభుత్వం 12 గంటలు పని చేయాలని నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం కార్మిక లోకాన్నికి తీవ్ర అన్యాయం చేసినట్లేనని విమర్శించారు. కార్మికులకి కనీస అవసరాలని కల్పించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాయని, అంగన్వాడి, ఆశ, మున్సిపల్, గ్రామపంచాయతీ, లు, ఉద్యోగ భద్రత కల్పించాలని స్వతంత్రం వచ్చి 77 ఏళ్లు గడిచిన నేటికీ పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం కనీస వేతనాలు అమలు కాకపోవడం చాలా విడ్డూరంగా ఉందని ఇది నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని వారి యొక్క అభివృద్ధికి నిదర్శనం అని అన్నారు. అసంఘటితరంగా కార్మికులకు నేటికీ ఫుట్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఎద్దేవ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఒకటే ఫుట్ బోర్డు ఉందని హమాలీ, ఆటో డ్రైవర్, నేటికి ఫుట్ బోర్డు ఏర్పాటు చేయకపోవడం సరైనది కాదని అన్నారు. వ్యవసాయ కార్మిక కూలీలకి కేరళ రాష్ట్రంలో రోజువారి కూలీ 800 రూపాయలు ఇస్తున్న దేశంలో ఎక్కడ కూడా ఏ రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు అమలు చేయడంలో విఫలమైనాయి. వ్యవసాయ కూలీలకి కనీస వేతనాలు అమలు చేయాలని ఉపాధి కూలీలకి 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో నాయకులు ప్రేమ్ కుమార్, నర్సింహా,చిన్న,కాకి శ్రీను, నాయకులు శ్యామెల్,కుర్మన్న,విజయ్, ఏఐటీయూసీ నాయకులు ఇజరాయుల్, సౌల్ తదితరులు పాల్గొన్నారు.

## నేను చంద్రబాబు ప్రొడక్ట్.. అలా చెప్పుకోవడానికి
## గర్వపడతా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు




మధురవాడ జనం రిపోర్టర్:"చంద్రబాబు నాయుడి ప్రోత్సాహంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన నేను ఆయన ప్రొడక్ట్ అని చెప్పుకోవడానికి గర్వపడతాను" అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. పాలనా సంస్కరణలు, అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచిన చంద్రబాబు విజన్ కు దేశమంతా హారతులు పడుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, చెన్నై ఎక్కడకు వెళ్లినా.. చంద్రబాబు లాంటి విజనరీ లీడర్ ఉండడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల అదృష్టమని అక్కడి మిత్రులు చెబుతుంటారని అన్నారు. మధురవాడ వి కన్వెన్షన్ లో మంగళవారం జరిగిన భీమిలి నియోజకవర్గం మినీ మహానాడులో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను ఎంతగానో ఇష్టపడతానని, పేద ప్రజలకు సంక్షేమాన్ని.. మహిళలకు ఆస్తి హక్కు, సమాన అవకాశాలు కల్పించిన యుగపురుషుడని కీర్తించారు.ప్రపంచంలోనే కార్యకర్తలకు సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన మొట్టమొదటి రాజకీయ పార్టీ టీడీపీ అన్నారు. యువ నాయకుడు లోకేష్ ఇచ్చిన స్ఫూర్తితో కోటి సభ్యత్వాల మార్కును సాధించడం రాజకీయ చరిత్రలో అరుదైన అంశమని తెలిపారు. లక్ష సభ్యత్వాలతో రాష్ట్రంలో టాప్ 10 లో భీమిలి కూడా ఉండడం వెనుక గంటా రవితేజ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. అత్యధిక మెజారిటీ ఇచ్చిన భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. అనంత పద్మనాభస్వామి ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మాణం.. సింహాచలం దేవస్థానం నిర్మాణాల క్రమబద్ధీకరణ.. వంటి దీర్ఘకాలిక అంశాలను పరిష్కరిస్తానని తెలిపారు. అప్పులతో రాష్ట్రాన్ని అప్పజెప్పినప్పటికీ.. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను ప్రాధాన్య క్రమంలో నెరవేరుస్తూ వస్తున్నామని గంటా చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల భర్తీలో న్యాయం చేస్తామన్నారు. ఒక కార్యకర్తకు ఒక పదవి.. వంటి నిబంధనలను అనుసరించి ఎంపిక చేసిన కొత్త కమిటీలను తొందర్లోనే ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. రూ. 2 వేల పెన్షన్ ను రూ. 3 వేలు చేయడానికి వైసీపీ ప్రభుత్వం అయిదేళ్ల సుదీర్ఘ సమయాన్ని తీసుకుందని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 3 వేల పెన్షన్ ను రూ. 4 వేలు చేసిందన్న విషయాన్ని గుర్తు పెట్టుకుని మాట్లాడాలని ఆ పార్టీ నాయకులకు సలహా ఇచ్చారు.యువ నాయకుడు గంటా రవితేజ మాట్లాడుతూ టీసీఎస్, గూగుల్, అదానీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సాఫ్ట్ వేర్ సంస్థలను భీమిలి నియోజకవర్గానికి తీసుకు వస్తున్న ఐటీ శాఖ మంత్రి లోకేష్.. ఆ సంస్థల ఉద్యోగాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యమిచ్చేలా చూడాలని కోరారు. యువత భవిష్యత్ కోసం నిరంతరం ఆలోచించే లోకేష్ నాయకత్వంలో పని చేయడం అదృష్టమన్నారు. పార్టీ పరిశీలకుడైన డీసీఎంఎస్ చైర్మన్ కోట్నీ బాలాజీ మాట్లాడుతూ తెలుగుదేశానికి భీమిలి కంచుకోటని, లక్షకు పైగా సభ్యత్వాలు నమోదు చేయడమనేది సామాన్యమైన విషయం కాదన్నారు. 6 వ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, పి.వి.నరసింహం, మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, గంటా అప్పలకొండ, లొడగల అప్పారావు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, డి.ఎ.ఎన్.రాజు, కోరాడ రమణ, బి.ఆర్.బి. నాయుడు, జీవన్ కుమార్, గాడు అప్పలనాయుడు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తు లో
## వేగంగా నడుపుతున్న లారీ ను పట్టుకున్న పోలీసులు



మొగల్తూరు మే 20 జనం రిపోర్టర్ :జాతీయ రహదారి 216పై పాత కాలువ సమీపంలో మంగళవారం సాయంత్రం మద్యం మత్తులో ఓ డ్రైవర్ లారీని రాంగ్ రూట్ లో వేగంగా నడుపుతూ డివైడర్ ను గుద్దడం తో స్థానిక యువకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన ప్రాంతానికి చేరుకొన్న మొగల్తూరు ఎస్సై జి.వాసు డ్రైవర్ కు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ఆ టెస్ట్ లో 269 పాయింట్లు రావడంతో లారీని సీజ్ చేసి డ్రైవర్ ను అదుపులో తీసుకున్నారు.

## గతమే ఘనం అంటున్న పెందుర్తి ప్రజలు
## పిర్యాదు దారులపై ఎదురు దాడి చేస్తున్న ఏమ్మార్వో

కబ్జా భూమిని కాపాడే వారెవరు అంటున్న సుజాత నగర్ వాసులు

పంచకర్ల పై కూడా పలు అనుమానాలు వై సి పి కాపాడింది కూటమి వదిలేసింది



జనం రిపోర్టర్: పెందుర్తి సుజాత నగర్ సర్వేనెంబర్ 163 చెరువులో ప్రతీ రోజు షెడ్లు నిర్మాణం జరుగుతుంటే స్థానిక వి ఆర్ ఓ మాత్రం కబ్జా కారులకు కొమ్ముకాస్తు అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. గత వైఎస్ఆర్ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలలో కనీసం ఒక్క షడ్ కూడా నిర్మాణం జరగకుండా కాపాడిన స్థలాన్ని కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం కాకముందే ఎకరాలకు ఎకరాలు కబ్జా చేస్తుంటే స్థానిక విఆర్ఓ తనకేమీ తెలియనట్టు నిద్ర నటిస్తున్నారు. చెరువు కబ్జాలో తహసీల్దార్ పూర్తి సహకారం అందిస్తున్నారని స్థానికులు బహిరంగాను విమర్శిస్తున్నారు. స్థానికులు ఎవరైనా చెరువు కబ్జాగురించి ఎమ్మార్వో కు పిర్యాదు చేస్తే ప్రభుత్వ స్థలాలను కాపాడవలసిన బాధ్యత మీకు లేదా, మీరెందుకు కాపాడలేకపోతున్నారని పిర్యాదు దారులపై ఎదురు ప్రశ్నలు వేస్తున్నారని స్థానికులు విస్మయ్యం చెందుతున్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడవలసిన ప్రభుత్వ అధికారులు ఫిర్యాదుదారులపై ఎదురు దాడి చేస్తుంటే ప్రజల కష్టాలు ఇంకెవరికి చెప్పుకోవాలని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి చిన్న సమస్యలు పరిష్కరించలేని తహసీల్దారు పై జిల్లా స్థాయి అధికారి కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వంలోని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భూకబ్జాలను సహించమని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, మొట్టమొదటి విశాఖపట్నం వచ్చి కబ్జాలకు కాపలా కాస్తానని ఊ క దంపుడు ఉపన్యాసాలు ను సైతం పట్టించుకోని స్థానిక జనసేన ఎమ్మెల్యే పై కూడా పలు రకాల విమర్శలు వ్యక్తం చేస్తున్నారు నియోజకవర్గం ప్రజలు. ఇప్పటికైనా స్పందించి పెందుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తహసీల్దార్ సహకారం తో చెరువును కాపాడి గత ప్రభుత్వం కంటే మెరుగుగా ప్రజా అవసరాలకు వినియోగం లోకి తీసుకు రావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## అనకాపల్లి, 5: 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులందరినీ ఓటర్లుగా చేర్చాలని జిల్లా రెవిన్యూ అధికారి మరియు ఉప జిల్లా ఎన్నికల అధికారి వై. సత్యనారాయణరావు తెలిపారు.



జనం రిపోర్టర్: రాజకీయ పార్టీల ప్రతినిధులతో నెలవారీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో, ఎన్నికల ప్రక్రియ పారదర్శక నిర్వహణలో రాజకీయ పార్టీల సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు.



ఓటరు జాబితాకు సంబంధించిన అభ్యంతరాలుంటే తెలియజేయాలని జిల్లా రెవిన్యూ అధికారి తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఓటరు జాబితాలో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులను కొత్త ఓటర్లుగా చేర్చడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులందరినీ ఓటర్లుగా చేర్చుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలేజీలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, కాలేజీల ప్రన్సిపాల్ ద్వారా కాలేజీలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా చేర్చాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎలక్షన్ సెక్టను సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి.నాయుడు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బి. శ్రీనివాసరావు, బి.జె.పి. ప్రతినిధి పి.నాగేశ్వరరావు, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాధబాబు, ఐఎన్ సి ప్రతినిధి కె.వి.సత్యనారాయణ, సి.పి.ఎం.ప్రతినిధి జి.శ్రీరామ్ పాల్గొన్నారు. జారీ: జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, అనకాపల్లి

## వైసీపి హయాంలో మంజూరు అయిన
## అక్రమ లైసెన్సులపై తగు విచారణ జరపాలి: గల్లా మాధవి




గుంటూరు జనం రిపోర్టర్:గుంటూరు మిర్చి యార్డులో వైసీపీ హయాంలో జరిగిన కోట్లాది రూపాయల అక్రమాలు మరియు ప్రధానంగా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులకి మంజూరయిన అక్రమ లైసెన్సుల గురించి సమగ్ర విచారణ జరిపి లైసెన్సులు రద్దు చేసి భాద్యులయిన వారిమీద కఠిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతూ గుంటూరు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజా గారికి వినతి పత్రం అందజేసిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి.

## సంగం డెయిరి లో కెరీర్ గైడెన్స్ వర్క్‌షాప్ .






పొన్నూరు మే 20. జనం రిపోర్టర్:సంగం డెయిరి ఉద్యోగుల పిల్లల సరైన కెరీర్ మరియు విద్యా నిర్ణయాలు తీసుకోవడం లో సహాయపడడానికి మెంటోరియా, ముంబై వారి ఆధ్వర్యములో "కెరీర్ గైడెన్స్ వర్క్‌షాప్" ను విజ్ఞాన్ యునివర్సిటి నందు మే 20వ తారీఖున నిర్వహించబడినది. ఈ కార్యక్రమము 8వ తరగతి నుండి 12వ తరగతి మరియు కళాశాల విద్యార్థుల కోసం రూపొందించబడినది. ఈ కార్యక్రమములో పిల్లల భవిష్యత్తుకు సంబంధించి కెరీర్ నిర్ణయాల ప్రాముఖ్యతలు మరియు సంక్లిష్ట, వివిధ రంగాలలో అందుబాటులో ఉన్న కెరీర్ ఎంపిక గురించి, టెక్నాలజి, %ూ×% మరియు పనిలో దాని ప్రభావము, కొత్త విద్యావిధానము మరియు కెరీర్ ఎంపికలుపై ధాని ప్రభావం, ఇలా మరెన్నో రంగాల గురించి వివరించినారు. ఈ కార్యక్రమములో లో 13 నుంచి 21 సంలు వయసు కలిగి ఉన్న, 8వ తరగతి నుంచి పై తరగతులు చదువుతున్న సుమారు 200 మంది పిల్లలు మరియు 150 మంది తల్లితండ్రులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ కార్యక్రమము నందు మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్ అనిల్ కుమార్ మరియు సంగం డెయిరి ఆధికారులు మరియు ఉధ్యోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొనినారు.

## రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా జిలుగు విత్తనాలు

### వెంటనే అందించాలి బీజేపీ మండల అధ్యక్షులు పోలోజు సంతోష్



చిగురుమామిడి (జనం రిపోర్టర్) :చిగురుమామిడి మండలంలో ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించాల్సిన జిలుగు విత్తనాలు ఇంక అందుబాటులోకి రాకపోవడం తో రైతులు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు పోలాలల్లో జిలుగు విత్తనాలు చల్లడం ద్వారా ఎరువు గా ఉపయోగ పడటం తో ప్రతి సంవత్సరం యాసంగి వరి కోతల అనంతరం రైతులు ఈ విత్తనాలను చల్లుకుంటారు కానీ ఈ సంవత్సరం ఇప్పటికే జిలుగు విత్తనాలు చల్లాల్సి ఉండగా ఒకవైపు వర్షాకాలం ప్రారంభం కావస్తూ ఉంది అయినా రైతులకు విత్తనాలు అందించడం లో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికైనా వెంటనే స్పందించి జిలుగు విత్తనాలు సబ్సిడీ ద్వారా అందించాలని బీజేపీ మండల అధ్యక్షులు పోలోజు సంతోష్ డిమాండ్ చేయడం జరిగింది

## ఉల్లంపల్లిలో ఘనంగా శ్రీరామ యజ్ఞం..

### అర్చకులు కుర్జి ఆదిశేషు వర్ధనస్వామి చేతుల మీదిగా ప్రత్యేక పూజలు..

### భక్తులకు మహా అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు..



చిగురుమామిడి(జనం రిపోర్టర్):కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ ఆంజనేయ స్వామి దీక్షపరుల ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరామ యజ్ఞాన్ని శ్రీహరిహరా పీఠం వ్యవస్థాపకులు, హరిహర ఓదెల మల్లన్న క్షేత్రం ప్రధాన అర్చకులు కుర్జి ఆదిశేషు వర్ధనస్వామి చేతుల మీదుగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి దీక్షపరుల సమక్షంలో ఆంజనేయ స్వామికి ఉదయం నుండి ప్రత్యేక పూజ కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం,అగ్ని ప్రతిష్ట, గణపతి హొమం,నవగ్రహ హొమం, శ్రీరామచంద్రస్వామికి రామ యజ్ఞం,మహా పూర్ణహుతి, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు సామూహిక మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. శ్రీ ఆంజనేయ స్వామి దీక్ష పరులు హనుమాన్ శోభయాత్రను వైభవంగా నిర్వహించారు. జై శ్రీరామ్ జై హనుమాన్ అంటూ సంతోషంగా గడిపారు. శ్రీ ఆంజనేయ స్వామి భక్త బృందానికి కొత్తపల్లి శ్రీకాంత్ మానస, కొలిపాక శ్రీను మంగవ్వ కుటుంబ సభ్యులు దాదాపు 20వేల రూపాయలు విలువచేసే పల్లకిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండ పురుషోత్తం,బుర్ర సంపత్ గౌడ్,కొత్తపల్లి శ్రీకాంత్,కొలిపాక పవన్,జనవేణి అనిల్,కొండ మల్లికార్జున్,కొలిపాక శ్రీనివాస్,దినేష్,శంకర్,చీమూర్తి నరసయ్య,రాజు,బండారి సాగర్,నవీన్, శ్రీనివాస్,మణిదీప్,సిద్దు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ



నందలూరు, జనం రిపోర్టర్ : మండలంలోని జాతీయ రహదారిపై స్థానిక ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తన సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం చెయ్యేరు నది సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం (హెల్మెట్) ధరించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ ఆదేశాల మేరకు నిర్వహించడం స్పెషల్ డ్రైవ్ జరిగిందని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని అన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే అట్టి వారిపై తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. మద్యపానం సేవించి వాహనాలను నడపరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై అలాగే వాహన యజమానులపై చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. కావున వాహనదారులు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ చేరిన ప్రేమ జంట




నందలూరు, జనం రిపోర్టర్ : మండలంలోని నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధి లోని నాగిరెడ్డిపల్లి లో నివాసం ఉంటున్న గొల్ల శ్రావణి (19) విగ్నేశ్వరన్( 21) ప్రేమ వివాహం చేసుకొని నందలూరు పోలీస్ కు స్టేషన్ కు చేరుకొని. పోలీసులను ఆశ్రయించారు, స్థానిక ఎస్సై మల్లికార్జున రెడ్డి ఇరువురిని విచారించగా ఇద్దరు మేజర్లు కావడంతో అమ్మాయి తాను ఇష్టపూర్వకంగా వివాహం చేసుకున్నానని పోలీసులకు తెలిపింది, దీంతో పోలీసు ఇరువురి కుటుంబాలను పోలీస్ స్టేషన్కు పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు ఎస్ ఐ తెలిపారు.

# ఐఎఫ్టియు ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడ్ల ప్రతులను దగ్ధం....




రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:మే 20. బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల ను రద్దు చేయాలని ఈరోజు గోదావరిఖని లో భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సమీపంలో బస్టాండ్ సమీపంలో 4 లేబర్ కోడ్స్ ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ మాట్లాడుతూ.. దేశంలో కార్మిక వర్గం బ్రిటిష్ కాలం ( 1926 ) నుండి పెద్ద ఎత్తున పోరాటాలు చేసి అనేక చట్టాలను సాధించుకోవడం జరిగిందనీ, 44 కార్మిక చట్టాలు కొనసాగుతున్నాయి. అందులో 29 కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం కుదించి నాలుగు లేబర్ కోడ్ గా తీసుకురావడం జరిగింది. ఇందులో వేతనాల కోడ్, వృత్తి భద్రత ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్, సామాజిక భద్రత కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, వీటి ద్వారా 29 కార్మిక చట్టాలు రద్దు చేయబడతాయనీ,ఈ కోడ్లను సవరించడంలో ప్రధానంగా భారతదేశంలో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలు లక్షల కోట్ల ఆదాయాన్ని ఈ దేశానికి సమకూర్చిపెట్టే మినీ రత్న, మహారత్న, నవరత్న, బిరుదులు పొందిన ప్రభుత్వ రంగ సంస్థలు అన్నీ కూడా కార్పొరేట్ సంస్థలకు అమ్మడం కొరకు పూనుకొని, అందు లో పని చేసే కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా చేయడం కొరకు




నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ నాలుగు కోడ్లను తీసుకురావడం జరిగింది. ఈ నాలుగు కోడ్లను అమలు చేయాలని బిజెపి ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలుగా తహతహలడుతుంది. ఈ నాలుగు కార్మిక కోడ్లను నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్ లో ప్రచురించింది. వాటి అమలు కోసం కేంద్ర ప్రభుత్వం విధివిధానాలను కూడా సిద్ధం చేసింది. గెజిట్ నోటిఫికేషన్ మాత్రమే మిగిలి ఉంది చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నాలుగు కోడ్లను అమలు కోసం అవసరమైన ఉద్యోగ నియామకాలు భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. కార్పొరేట్ల ప్రయోజనాలను తీర్చడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం చాలా ఆసక్తిగా ఉంది. అయినా మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కార్మికుల వ్యతిరేకతకు భయపడి లేబర్ కోడ్లను అమలు చేయడానికి వెనుకాడుతుంది. అయితే ఇప్పుడు వాటిని అమలు చేయడానికి చేసే ప్రయత్నాలు చివరి దశలో ఉన్నట్లు కనిపిస్తుంది. అందువల్ల ఈ నాలుగు లేబర్ కోడ్లను పూర్తిగా ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడానికి కార్మిక వర్గం ఒక పెద్ద మిలిటెంట్ ఉద్యమాన్ని నడపాల్సిన అవసరం ఉంది. కార్మికుల వ్యతిరేకత నేపథ్యంలోనే పార్లమెంట్ ఆమోదించిన పారిశ్రామిక వివాదాల చట్టానికి (1982)లో చేసిన సవరణలు కాని పార్లమెంటు ఆమోదించిన కార్మిక చట్టాలలో చేసిన కొన్ని మార్పులను సవరణలు అమలు చేయడానికి ప్రభుత్వాలు నిలిపివేశాయని ఈ సందర్భంగా అన్నారు. కనుక జాతీయ వ్యాప్తంగా పెద్దన్న పాత్ర పోషిస్తున్న కార్మిక సంఘాలు కార్మికులని ఈ నాలుగు లేబర్ కోట్లు అమలైతే జరిగే నష్టాన్ని చైతన్యం చేయాల్సిన పని ఉంది భారతదేశంలో ఉన్న లక్షలాది మంది కార్మికులని ఐక్యం చేయాల్సిన అవసరం ఉంది, అది చేయకుండా కేవలం నిరసన కార్యక్రమాలతోని బిజెపి ప్రభుత్వం తీరాదని ఈ సందర్భంగా జాతీయ కార్మిక వర్గాన్ని కోరుతున్నాం. అన్నారు. భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేసి నాలుగు లేబర్ కోట్లను రద్దు చేసే వరకు పోరాడాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయు నాయకులు ఎ వెంకన్న, డి బ్రహ్మానందం,ఈ నరేష్ ,బి అశోక్, ఈదునూరి రామకృష్ణ ,ఐ రాజేశం, జి మల్లేశం, బి బుచ్చమ్మ, అనే ఎడ్ల రవికుమార్, కె రాజేశ్వరి, కె శారద, మేరీ, ఇరుగురాల గట్టయ్య, బి శ్రీనివాస్, ఓదెలు, లింగయ్య లు తదితరులు పాల్గొన్నారు.

# రంపచోడవరంలో ఘనంగా మినీ మహానాడు.



రాజవొమ్మంగి, రంపచోడవరం మే 20 జనం రిపోర్టర్ :అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గ ప్రజానీకానికి ఎమ్మెల్యేగా నేను తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే శిరీష దేవి అన్నారు మంగళవారం తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు రంపచోడవరం నియోజకవర్గంలో రంపచోడవరం మహానాడు కార్యక్రమం ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయభాస్కర్ దంపతులు ఆధ్వర్యంలో రంపచోడవరం మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ముందుగా అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే దంపతులు, మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నంబాబూ రమేష్, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం తెలుగుదేశం పార్టీ శ్రేణులతో ర్యాలీగా బయలుదేరి సభ ప్రాంగణానికి వెళ్లి, మహానాడు వేదిక వద్ద మఠం విజయభాస్కర్ రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు.తదనంతరం ఎమ్మెల్యే శిరీష దేవి తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ రంపచోడవరం మన తెలుగుదేశం పార్టీ పసుపు పండగ మహానాడుకు విచ్చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మన ఎన్టీఆర్ కాలంలోనే గిరిజనాభివృద్ధి జరిగిందని అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా అయిన తర్వాతే పేద ప్రజల కోసం కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని తీసుకువచ్చి పేద ప్రజల ఆకలని తీర్చారని పేర్కొన్నారు. పేదలు బాగుండాలని కూడు,గూడు, గుడ్డ ఉండాలని మంచి లక్ష్యంతో పార్టీని స్థాపించి, అతి తక్కువ కాలంలోనే తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చి నేటికీ తిరుగులేని పార్టీగా నిలిపిన అన్న నందమూరి తారకరామారావు ఎప్పటికీ శిరస్మరణీయులేనని అన్నారు. అదే తెలుగుదేశం పార్టీని నేటికీ కూడా తిరుగులేని పార్టీగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నడిపిస్తున్నారని అన్నారు. ఆనాడు గిరిజన ప్రాంత ప్రజలు విద్యావంతులు కావాలన్నా ఉద్దేశంతో ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వంలోనే గురుకులాల విద్యాలయాలు స్థాపించిన ఘనత మన అన్న నందమూరి తారక రామారావుకి దక్కుతుందని అన్నారు. గిరిజనుల పూరి గుడిసెల్లో ఉంటున్నారని గ్రహించి పక్క గృహాలను మంజూరు చేశారని చెప్పారు. అదేవిధంగా రంపచోడవరం మహానాడులో రంపచోడవరం పాడేరు జిల్లాగా ఉండటం వల్ల 300 కిలోమీటర్ల పైగా ప్రయాణించాల్సి వస్తుందని అందుకు రంపచోడవరాన్నే జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని,ఎన్టీఆర్ కి భారతరత్న ఇవ్వాలని తీర్మానం చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా పోలవరం నిర్వాసితుల సమస్యలు పునరావాస, ప్యాకేజీ మంజూరు చేయాలని తీర్మానం చేశామని తెలిపారు. ఇలా నియోజకవర్గంలోని ముఖ్యమైన అంశాలపై తీర్మానం చేసి రాష్ట్ర మహానాడుకు నివేదిస్తామని అన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల గెలుపునకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా చంద్రబాబుకి, లోకేష్ కి, మీ ఎమ్మెల్యే నైనా నన్ను శిరీష దేవి కి మీయొక్క ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కోరారు. మాజీ శాసనసభ్యులు, జిసిసి డైరెక్టర్ గొర్లె సునీత, నియోజకవర్గం పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేష్ లు మాట్లాడుతూ పేద ప్రజల కోసం తెలుగుదేశం పార్టీ చేసిన కృషి తెలుగు ప్రజలెవరూ మర్చిపోరని అన్నారు. తెలుగుదేశం పార్టీకి పునాదులు కార్యకర్తలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహానాడుకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ దంపతులు 3000 మందికి పైగా భోజన సదుపాయాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణ రావు, వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, వి ఆర్ పురం జడ్పిటిసి వి రంగారెడ్డి, ఎటపాక వైస్ ఎంపీపీ దొంతుమంగేశ్వరరావు, శివాజీ,జమాల్ ఖాన్, తెలుగుదేశం పార్టీ 11 మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, జర్తా వెంకటరమణ రెడ్డి, పల్లాల రమణారెడ్డి, పాము అర్జున్, కారం సురేష్ బాబు దొర, మర్రి చెట్ల వెంకటేశ్వరరావు, గురుకు శేషు కుమార్, బరపాటి ప్రకాష్, పుట్టి రమేష్, ఇళ్ల చిన్నారెడ్డి, ఆచంట శ్రీనివాసరావు, దంతులూరి శివరామచంద్ర రాజు, కరకా వెంకటరమణ, గణజాల తాతారావు, ఎం కేశవ్, ఏ సత్తిబాబు, అడబాల బాపిరాజు, సత్యనారాయణ, కనిగిరి రాంబాబు, తైలం గంగాధర్, మధుసూదన్ రావు, ఏం బాబురావు, గురునాథరెడ్డి, షేక్ సుభాని, బిసెట్టి అప్పాజీ, పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, ఎడవల్లి భాస్కరరావు, జి ప్రసాద్ ముప్ప శ్రీనివాస్ రావు వల్లభనేని చందు, బొర్రా నరేష్ పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశిష్ట సేవా కార్యక్రమం శ్రీ వెంకయ్య స్వామి గుడిలో భోజన వితరణ




పొదిలి జనం రిపోర్టర్ :పొదిలిలో సామాజిక సేవకు మారుపేరు లాగా నిలిచిన దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ దివ్యాంగులు, నిరుపేదల కోసం అనేక సేవా కార్యక్రమాలను నిబద్ధతతో నిర్వహిస్తూ వస్తోంది. ఈ సేవా సంకల్పంలో భాగంగా ఇటీవల ప్రారంభించిన భోజన పంపిణీ కార్యక్రమం గ్రామ ప్రజల్లో విశేష స్పందన పొందుతోంది. ఈ సేవా కార్యాచరణను గమనించిన పొదిలికి చెందిన శ్రీ వెంకయ్య స్వామి గుడి నిర్వాహకులు, ప్రతి శనివారం, అలాగే ఆరాధన మరియు ప్రత్యేక కార్యక్రమాల సందర్భాల్లో, భక్తులతో పాటు నిరుపేదలకు భోజన వితరణ చేయాలని ముందుకు వచ్చారు. ఇది గ్రామంలో మానవతా విలువలు వెల్లివిరియే విధంగా మారింది. ఇవాళ నిర్వహించిన శ్రీ వెంకయ్య స్వామి గుడి ప్రత్యేక కార్యక్రమంలో, ఓ ఉదారహృదయ దాత తమ సహాయాన్ని అందిస్తూ, విశేష సేవ చేశాడు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకే కాకుండా, దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని అనేకమంది నిరుపేదలకు కూడా ఆహారం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ప్రతిసారీ అందుతున్న ఆదరణ చూస్తుంటే, గ్రామస్థుల మధ్య మానవతా భావం మరింత బలపడుతోందని %ాతీస్త్రుఅఅఓవతీ%లు తెలియజేశారు. "ఇది దేవుని ఆశీస్సులతో జరిగే సేవ. భవిష్యత్తులో మరింత మంది దాతల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని ఆశిస్తున్నాం," అని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

## వాతంగిలో జన మైత్రి కార్యక్రమం:ఎస్ఐ చినబాబు




రాజవొమ్మంగి మే 20 జనం రిపోర్టర్:అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం రాజవొమ్మంగి మండలం జడ్డంగి పోలీసు స్టేషన్ పరిధిలో వాతంగి పంచాయితీ వాతంగి గ్రామ ప్రజలతో మంగళవారం ఎస్ఐ చినబాబు జనమైత్రి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చినబాబు మాట్లాడుతూ ఈకేవైసి,ఓటిపి మోసాలు,క్యూ ఆర్ కోడ్స్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ ఫోన్లలలో తెలియని లింక్స్ పై క్లిక్ చేయవద్దని పేర్కొన్నారు క్రిమినల్ చట్టాలు,నూతన వాహన చట్టాలపై అవగాహన కల్పించారు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు ఆన్లైన్ గేమ్స్ జోలికి పోవద్దని తెలియజేశారు గంజాయి అమ్మకం రవాణా చట్టరీత్యా నేరమని తెలిపారు. అంతే కాకుండా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించి బాల్యవివాహాలను ప్రోత్సహించవద్దని అన్నారు. మీ ప్రాంతంలో ఎవరైన బాల్యవివాహాలు జరిపే ప్రయత్నంచేస్తే వారికి బాల్యవివాహాల వలన కలిగే నష్టాలను వివరించి వారిని ఆపే బాధ్యత మీ అందరికీ ఉందని తెలిపారు. అయినప్పటికీ వారు వివాహం జరపాలని చూస్తే మాకు సమాచారం తెలపాలని కోరారు. విద్యుత్ వైర్ల ద్వారా వన్యప్రాణులను వేటాడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట పోలీసు సిబ్బంది,గ్రామ ప్రజలు,యువత పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సార్.....ఇటు జార దేకో.....!!!!


ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు
పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి ఏప్రిల్1, (ఆంధ్రప్రభ) : పెందుర్తి నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ

జనం రిపోర్టర్ : మీ నియోజకవర్గం లో జరుగుతున్న భూ కబ్జాపై జరా దృష్టి పెట్టడి...!!!ప్రభుత్వ భూములు ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్ పరం చేస్తున్నా అధికారులపై చర్యలు ఎప్పుడు తీసుకొంటారు...??ప్రభుత్వ భూములు ఎప్పుడూ స్వాధీనం పరుస్తారు...??ప్రభుత్వ ఆస్తులకు కాపలాగా ఉటాను అన్నా డిప్యూటీ సీఎం సాబ్ కల ఎప్పుడూ నెరవేరుస్తారు..???ప్రభుత్వ ఆస్తులు కాపాడ లేని వారు ప్రజల ఆస్తులు ఏవిధంగా కాపాడుతారు...???ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు మీరు ఏం సమాధానాలు చెప్పుతారు..??

## బిజెపి మంత్రి విజయ్ షాపై సుప్రీం అక్షింతలు.. సిట్ ఏర్పాటు



న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ గురించి మీడియాకు వివరించిన భారత ఆర్మీ అధికారి కల్నల్ సోఫియా ఖురేషిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది ధర్మాసనం. కల్నల్ సోఫియా ఖురేషిని "ఉగ్రవాదుల సోదరి" అని అన్నందుకు తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని మంత్రి విజయ్ షా సుప్రీంకోర్టుకు వెళ్ళిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విచారించిన సుప్రీంకోర్టు.. "మీరు ఒక ప్రజా వ్యక్తి. అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు. మీరు ప్రజాప్రతినిధిగా ఉన్నప్పుడు ఎంతో జాగ్రత్తగా మాట్లాడాలి. ఇది సాయుధ దళాలకు ముఖ్యమైన విషయం. మనం చాలా బాధ్యతాయుతంగా ఉండాలి. మీరు చేసిన వ్యాఖ్యలకు దేశ ప్రజలంతా సిగ్గుతో తలవంచుకోవాల్సి వచ్చింది" అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలను విచారించడానికి ఒక మహిళా అధికారితో సహా ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులతో సిట్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మంత్రి విజయ్ షా అరెస్టును నిలిపివేయాలని.. కానీ ఆయన సిట్‌కు పూర్తిగా సహకరించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ నెల 28వ తేదీ లోపు విచారణకు సంబంధించిన నివేదికను అందజేయాలని సుప్రీంకోర్టు తెలిపింది.

## ప్రతిరైతుకు సోలార్ విద్యుత్ అందించి తీరుతాం




హైదరాబాద్: పాలమూరు బిడ్డల చెమటతోనే ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పాలమూరు అంటే తనకు ఎంతో గౌరవం అని అన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలబెడతానని చెప్పారు. ఈ సందర్భంగా పాలమూరులో సిఎం మాట్లాడుతూ..గిరిజనల కోసం ప్రత్యేక పథకాలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ది అని చెప్పారు. అచ్చం పేటలో ప్రతిరైతుకు సోలార్ విద్యుత్ అందించి తీరుతామని తెలియజేశారు. సోలార్ విద్యుత్ అందించడమే కాదు.. ఆదాయం వచ్చేలా చేస్తామని రుణమాఫీ చేశామని తెలియజేశారు. వడ్లకు బోనస్ ఇస్తున్నామని, వరి వేసుకుంటే ఉరేనన్న దొర మాత్రం వరి వేసి అమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. రైతుల కోసం ఇప్పటి వరకు రూ. 60 వేల కోట్లు ఖర్చు చేశామని, 50 లక్షల పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అన్నారు. మహిళలే ఆర్టిసి బస్సులు అద్దెకు తప్పుకునేలా చేశామని, మహిళా సంఘాలను పెట్రోలు బంకులకు యజమానులను చేశామని పేర్కొన్నారు. .2029 లోపు కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఇజ్రాయిల్ తాజా దాడుల్లో 22 మంది పాలస్తీనియన్లు మృతి



గాజా : పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ వైమానిక దాడికి 22 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని రెస్క్యూ సిబ్బంది సోమవారం తెలిపారు. ప్రధానంగా ఈరోజు గాజాలో దక్షిణ ప్రధాన నగరమైన ఖాన్ యూనిస్‌తోపాటు చుట్టుపక్కల ఇజ్రాయిల్ సైన్యం వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల వల్ల 11 మంది మృతి చెందారని, అనేమంది గాయాలపాలయ్యారని పౌర రక్షణ సంస్థ ప్రతినిధి మహమూద్ బస్సాల్ తెలిపారు. అలాగే అబాసాన్‌లో మరొకరు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. జబాలియా పట్టణానికి పశ్చిమాన ఉన్న మార్కెట్ సమీపంలో జరిగిన వైమానిక దాడిలో ఐదుగురు మృతి చెందారు. గాజా మధ్యలో ఉన్న నుసెయిరాట్‌లో ఉన్న గుడారంపై వైమానిక దాడికి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఉత్తరాన ఉన్న గాజా నగరంలో జరిగిన దాడికి ఒకరు చనిపోయారు. ఇదిలా ఉండగా గాజ స్ట్రిప్ అంతటా దాడులకు పాల్పడుతున్నట్లు ఇజ్రాయిల్ సైన్యం సోమవారం వెల్లడించింది.

## విచారణ నుండి తప్పించుకునేందుకు క్షమాపణలా

### – విజయ్ షాని చీవాట్లు పెట్టిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : కల్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాని సుప్రీంకోర్టు సోమవారం చీవాట్లు పెట్టింది. విచారణ నుండి తప్పించుకునేందుకు క్షమాపణలు చెబుతారా అని నిలదీసింది. మంత్రిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. మంత్రివి నిరర్థకమైన, బుద్ధిహీనమైన వ్యాఖ్యలు అని జస్టిస్ సూర్యకాంత్ మండిపడ్డారు. విచారణ నుండి తప్పించుకునేందుకు కోర్టుకు క్షమాపణ చెప్పడంలో అర్థంలేదని అన్నారు. విజయ్ షా వ్యాఖ్యలు చేసిన వీడియో క్లిప్‌లను ధర్మాసనం వీక్షించిందని, ఆ క్లిప్‌లను కోర్టుకు కూడా తీసుకువెళ్లిందని అన్నారు. ఆ వీడియోల్లో చాలా అసభ్యకరమైన, దుర్వినియోగమైన పదాలను వాడారని మండిపడ్డారు. ఒక ప్రజాప్రతినిధి, అనుభవజ్ఞులైన రాజకీయ నేత బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి పదాన్ని ఆచితూచి మాట్లాడాలని అన్నారు. మీ వ్యాఖ్యలతో ప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. మధ్యప్రదేశ్ కేడర్, డైరెక్ట్ రిక్రూట్ చేయబడిన ఐపిఎస్ అధికారులతో సిట్‌ను ఏర్పాటు చేయాలని ధర్మాసనం రాష్ట్ర డిజిపిని ఆదేశించింది. అయితే ఈ ముగ్గురు సభ్యుల్లో రాష్ట్రానికి చెందినవారు ఉండకూడదని, వారిలో ఒక మహిళ ఉండాలని పిఎస్ సూచించింది. ఇన్‌స్పెక్టర్ జనరల్ హోదా కలిగిన ఐఅధికారి సిట్‌కి నేతృత్వం వహించాలని, మిగిలిన ఇద్దరూ ఎస్‌పి హోదా కలిగి ఉండాలని పేర్కొంది. మే 20 ఉదయం పది గంటలలోపు సిట్‌ను నియమించాలని సూచించింది. దర్యాప్తు వివరాలను సిట్ స్టేటస్ రిపోర్ట్‌లో సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. అరెస్ట్ నుండి మినహాయింపు కల్పించిన కోర్టు .. విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది. తదుపరి విచారణను మే 28కి వాయిదా వేసింది.

# చీకటి వెలుగులు



ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఆలయాలు ఉన్నాయి. ఎన్నో మతాలు ఉన్నాయి. ఎన్నో ఆరాధనా పద్ధతులు ఉన్నాయి. ఆలయాల తొలి ఆనవాళ్లు క్రీస్తుపూర్వం పన్నెండువేల ఏళ్లనాటివి. దాదాపు అన్ని మతాలూ దైవభక్తిని ప్రబోధించేవే! జ్ఞానమార్గాన్ని బోధించిన మతాలు లేకపోలేదు గాని, జనాలను భక్తిపారవశ్యం ఆకట్టుకున్నంతగా జ్ఞానం ఆకట్టుకున్న దాఖలాలు తక్కువ. భాషలు పుట్టి, లిపులు ఏర్పడి, సమాచారాన్ని శిలల మీద, మట్టి పలకల మీద, లోహపు రేకుల మీద, ఆకుల మీద నిక్షిప్తం చేయడం మొదలుపెట్టిన తర్వాత గాని ప్రపంచంలో జ్ఞానవ్యాప్తి మొదలు కాలేదు. మనుషులకు అక్షరజ్ఞానం అబ్బిన తర్వాత తమకు తెలిసిన సమాచారాన్ని తమకు దొరికిన సాధనాలను ఉపయోగించుకుంటూ లిఖితపూర్వకంగా నిక్షిప్తం చేయడం మొదలుపెట్టారు. చరిత్రలో తొలినాటి రచనల ఆనవాళ్లు క్రీస్తుపూర్వం నాలుగో సహస్రాబ్ది నాటివి. మానవాళి జ్ఞానయానానికి అవి తొలి మైలురాళ్లు. భక్తిపారవశ్యం ఒకవైపు, జ్ఞానయానం మరోవైపు మానవాళి మనుగడను ఆది నుంచి నిర్దేశిస్తూనే ఉన్నాయి. సామాజిక, తాత్త్విక, శాస్త్ర, సాంకేతిక పురోగతికి ఎందరో జ్ఞానులు బాటలు వేశారు. లోకమంతటా తమ జ్ఞానకాంతులను ప్రసరించారు. వినువీథిలో ఒకవైపు సూర్యుడు సహా అసంఖ్యాక నక్షత్రాలు నిరంతరం వెలుగులను వెదజల్లుతున్నా, మరోవైపు చీకటి నిండిన కృష్ణబిలాలు కూడా ఉన్నాయి. అలాగే ఈ లోకంలో ఒకవైపు జ్ఞానులు ప్రసరించిన జ్ఞానకాంతులు ఉన్నా, మరోవైపు మౌఢ్యాంధకారం కూడా అంతే గాఢంగా ఉంది. మానవాళిలో మౌఢ్య నిర్మూలనమనేది ఇప్పటికీ నెరవేరని కలగానే మిగిలింది. 'మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అని గురజాడ ఆకాంక్షించారు. ఇప్పటి పరిస్థితులను గమనిస్తే, ఆయన ఆకాంక్ష నెరవేరడానికి ఇంకెన్ని యుగాలు పడుతుందో చెప్పడం కష్టం. ఆరాధించే వాటికి ఆలయాలను నిర్మించుకోవడం అనాది సంస్కృతి. దేవాలయాలను, ప్రార్థనాలయాలను నిర్మించుకున్న మనుషులు అక్కడితో ఆగిపోలేదు. ఆరాధ్య నటీనటులకు, నాయకులకు సైతం ఆలయాలను నిర్మించే స్థాయికి పరిణామం చెందారు. ప్రపంచంలో మౌఢ్యం శ్రుతిమించి మితిమీరిన కాలాల్లో సమాజాన్ని సంస్కరించడానికి ఎందరో సంస్కర్తలు ప్రయత్నించారు. జ్ఞానకాంతులతోనే మౌఢ్యాంధకారం పటాపంచలవుతుందని గ్రహించి, జ్ఞానవ్యాప్తికి కృషి చేశారు. ఒక తరం నుంచి మరో తరానికి జ్ఞానసంపదను అందించడానికి గ్రంథాలయాలను నెలకొల్పారు. ప్రపంచంలోని తొలి గ్రంథాలయం క్రీస్తుపూర్వం మూడో సహస్రాబ్దిలో ఏర్పడింది. ఇప్పటి సిరియాలోని టెల్ మార్డిక్ గ్రామంలో ఉందది. 'ది రాయల్ లైబ్రరీ ఆఫ్ ఎబ్లా' అనే ఈ గ్రంథాలయం తొలి జ్ఞాననిధి. ఇందులో ఇరవైవేల మట్టిపలకలపై ఉన్న రాతలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇది ద్విభాషా గ్రంథాలయం కావడం ఇంకో విశేషం. సుమేరియన్, ఎబ్లాయెట్ భాషలలో చిత్రలిపిలో రాసిన రాతలు ఆనాటి సామాజిక, వాణిజ్య, విద్యాపరమైన పరిస్థితులకు సాక్షీభూతంగా నిలిచి ఉన్నాయి. ఈ మట్టిపలకల్లో కొన్ని ఇప్పుడు సిరియాలోని డెమాస్కస్, అలెప్పో తదితర నగరాల్లోని మ్యూజియంలలో ఉన్నాయి. ప్రాచీనకాలంలో మన ఉపఖండ భూభాగంలోనూ నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లో గ్రంథాలయాలు ఉండేవి. ఇప్పుడు వాటి శిథిలావశేషాలు తప్ప ఆనాటి జ్ఞానసంపద ఏదీ మిగిలి లేదు. పురాతన గ్రంథాలయాలు ఏర్పడిన కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా మూఢాచారాలు కూడా విస్తృతంగా ఉండేవి. ఆ తర్వాత కాలంలో చాలా మార్పులు జరిగాయి. జాన్ గూటెన్‌బర్గ్ రూపొందించిన ముద్రణ యంత్రం పుస్తకాల రూపురేఖలను మార్చేసింది. ఆధునిక పుస్తకాలకు అంకురారోపణ చేసింది. పారిశ్రామిక విప్లవ కాలంలో పుస్తకాల ముద్రణ పెరగడం మొదలైంది. వలస పాలనలు మొదలవడంతో ప్రజలకు బహుభాషా పరిచయం ఏర్పడి, సమాచార ఆదాన ప్రదానాలు ఊపందుకున్నాయి. బ్రిటిష్ హయాంలో మన దేశంలో నాటి కలకత్తా నగరంలో 'ఏషియాటిక్ సొసైటీ లైబ్రరీ' పేరుతో తొలి ఆధునిక గ్రంథాలయం 1781లో ఏర్పడింది. అప్పటికి సతీసహగమన దురాచారంపై ఇంకా నిషేధం విధించలేదు. మన తెలుగునేల మీద 1886లో తొలి ఆధునిక గ్రంథా లయాన్ని విశాఖపట్నంలో మంతిన సూర్యనారాయణమూర్తి నెలకొల్పారు. అప్పటికి కన్యాశుల్కం దురాచారం తీవ్రంగా ఉండేది. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే అయ్యంకి వెంకటరమణయ్య నేతృత్వంలో గ్రంథాలయోద్యమం కూడా మొదలైంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అనేక మార్పులు జరిగాయి. ఎంతో అభివృద్ధి జరిగింది. ప్రజల్లో అక్షరాస్యత పెరిగింది. పత్రికలు, అధునాతన ప్రసార మాధ్యమాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అయినా, జనాల్లో మౌఢ్యం పూర్తిగా అంతరించలేదు. ఇప్పటికీ మన దేశంలో గ్రంథాలయాల కంటే దేవాలయాలు, ప్రార్థనాలయాలే ఎక్కువ. వైజ్ఞానికాభివృద్ధి ఫలితంగా అందివచ్చిన సాంకేతికత సాధనాలను కూడా వ్యర్థవినోదానికి వినియోగించుకోవడంలో మన జనాలు అపార ప్రజ్ఞాధురీణులు. మౌఢ్య ప్రాబల్యం ఎంతగా పెరుగుతున్నా, జ్ఞానారాధకులు అంతరించిపోలేదు. అందుకు నిదర్శనమే కేరళలోని కాసర్‌గోడ్ జిల్లా కంబళూరులో వెలసిన పుస్తకాలయం. పుస్తకమే ఇందులోని దేవత. పుస్తకాలే ప్రసాదం. 'జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అనే ఆకాంక్షను వెలిగించడానికి ఇదొక ఆశాదీపం.

# ముక్కలు కానున్న పాకిస్థాన్!




భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో బెంబేలెత్తిపోతున్న పాకిస్తాన్‌కు నైరుతి ప్రాంతంలో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బిఎల్ఎ) నుంచి కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. గత కొన్నేళ్లుగా స్వయంపాలన కోసం పోరాడుతున్న బలూచిస్థాన్ తిరుగుబాటుదారులు అదను చూసి మరీ పాక్ సైన్యంపై దాడులను ఉధృతం చేస్తున్నారు. తాడోపేడో తేల్చుకోవడానికి ఇదే తగిన సమయమని భావించినవారు మరో అడుగు ముందుకువేసి తమ ప్రాంతాన్ని బలూచిస్థాన్ రిపబ్లిక్‌గా ప్రకటించుకున్నారు. పోరాటయోధుడు మిర్ యార్ బలూచ్ నేతృత్వంలో బలూచిస్థాన్ నేతలు ఈ నెల 9న పాకిస్తాన్ నుంచి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. అంతేకాకుండా పాక్‌పై భారత్ చేస్తున్న దాడులకు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో పాటుగా ఆ పోరాటానికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. మరో వైపు బలూచిస్థాన్ రిపబ్లిక్‌ను స్వతంత్ర దేశంగా గుర్తించాలని, తమ దేశాల్లో బలూచిస్థాన్ దౌత్య కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించాలని ఐక్యరాజ్యసమితితో పాటుగా అన్ని ప్రపంచ దేశాలకు వారు విజ్ఞప్తి చేశారు కూడా. చూడడానికి ఇది ఓ మామూలు ప్రకటనగా కనిపిస్తున్నప్పటికీ దీని ప్రభావం పాకిస్తాన్ సుస్థిరతపైనా, అలాగే దక్షిణాసియా భౌగోళిక పరిస్థితులపైనా తీవ్ర ప్రభావం చూపించనుంది. ఎందుకంటే భౌగోళికంగా పాకిస్తాన్‌లో అతిపెద్ద ప్రావియన్స్ అయిన బలూచిస్థాన్ గత కొన్ని దశాబ్దాలుగా అశాంతికి నిలయంగా కొనసాగుతోంది. పాకిస్తాన్ ఫెడరల్ ప్రభుత్వం తమ వనరులను దోచుకుంటూ తమ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, ఇక్కడి ప్రజలను నిరుపేదలుగా మారుస్తోందని స్థానికులు చాలా కాలంగా ఆరోపిస్తున్నారు. అందుకే తమకు స్వయం పాలనాధికారం కావాలంటూ అక్కడి వారు పోరాటం చేస్తున్నారు. అంతేకాదు ఆ ప్రాంతంలో బలవంతపు కిడ్నాప్‌లు, చట్ట వ్యతిరేక హత్యలు లాంటివి ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో పెచ్చుమీరిపోయాయని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాల నివేదికలు చెబుతున్నాయి. వీటన్నిటినీ భరించలేని తిరుగుబాటుదారులు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) పేరిట గత కొంత కాలంగా పాకిస్తాన్ సైన్యమే లక్ష్యంగా దాడులు కొనసాగిస్తున్నారు. వీలు చిక్కినప్పుడల్లా పెద్ద సంఖ్యలో పాక్ సైనికులను మట్టుబెడుతూ పాక్ ఫెడరల్ ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారయ్యారు. గత మార్చిలో క్వెట్టానుంచి పెషావర్‌కు 400 మంది ప్రయాణికులతో వెళ్తున్న రైలును బిఎల్ఎ తిరుగుబాటుదారులు హైజాక్ చేయడం వారి ఉద్యమంలో ఓ మైలురాయిగా నిలిచిపోయింది. ప్రయాణికులను విడిపించడానికి పాక్ సైన్యం బ్రహ్మప్రయత్నమే చేయాల్సి వచ్చింది. పాక్ ప్రభుత్వం నిషేధిత ఉగ్రవాద సంస్థగా ముద్రవేసిన బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ పాకిస్తాన్‌లోని బలూచీ గిరిజన జాతుల విమోచన కోసం పోరాడుతోంది. పాకిస్తాన్‌లోని సింధీలు, పంజాబీలు నివసించే ప్రాంతాలు కొంత మేరకు అభివృద్ధి చెందినప్పటికీ వైశాల్యపరంగా దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన బలూచీస్థాన్ మాత్రం ఇప్పటికీ అత్యంత వెనుకబడిన ప్రాంతంగానే ఉంది. రాష్ట్రంలో అపారంగాఉన్న అరుదైన ఖనిజాలు, చమురు, సహజ వాయు నిక్షేపాలు లాంటి వాటిని తరలించుకుపోతున్న ఇస్లామాబాద్ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోవడం లేదనే అసంతృప్తి స్థానిక ప్రజల్లో చాలా కాలంగా గూడుకట్టుకుని ఉంది. దీంతో ఈ ప్రాంతంలో చాలా కాలంగా తిరుగుబాటు ఉద్యమాలు బలపడ్డాయి. 2007లో బాలాచ్ మర్రి నాయకత్వంలో ఏర్పడిన బలూచీస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఇటీవలి కాలంలో బలమైన సంస్థగా ఎదిగింది. ఇటీవలి కాలంలో బిఎల్ఎ 70కి పైగా ప్రధాన దాడులు జరిపినట్లు అంచనా. తాజాగా ఓ వైపు ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు కొనసాగిస్తున్న తరుణంలో పలు తిరుగుబాటు గ్రూపులు మూకుమ్మడిగా పాక్ సైన్యంపై పెద్ద ఎత్తున దాడి చేసి 16 మంది సైనికులను హతమార్చాయి. బలూచిస్థాన్‌లోని ప్రధాన నగరమైన క్వెట్టా ఇప్పుడు తిరుగుబాటుదారుల అధీనంలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బిఎల్ఎ పాకిస్థాన్ నుంచి విడిపోయి కొత్త దేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా ఆ సంస్థ కోరడం భారత ప్రభుత్వానికి కొంత సంకట పరిస్థితిని తెచ్చిపెట్టిందనే చెప్పాలి. ప్రత్యేక బలూచిస్థాన్ ఏర్పాటు డిమాండ్‌ను సమర్థించినట్లయితే దౌత్యపరంగా అది పాక్‌ను మరింతగా బలహీనపరిచినట్లవుతుంది. కానీ ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగిపోవడానికి కారణమవుతుంది. అందుకే ఈ విషయంలో భారత్ మౌనంగా ఉండడం మంచి వ్యూహమేనని చెప్పాలి. మరో వైపు చైనా వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడుతున్న గ్వాదార్ పోర్టు, చైనాపాక్ ఆర్థిక కారిడార్ (సిపిఇసి) బలూచిస్థాన్ ప్రాంతంలోనే ఉన్నాయి. అయితే స్వతంత్ర బలూచిస్థాన్‌ను ఏర్పాటు చేసుకుంటున్నట్లుగా తిరుగుబాటుదారులు చేసిన ప్రకటనకు ప్రపంచ దేశాల నుంచి ప్రస్తుతానికి ఎలాంటి మద్దతూ లభించకపోయినప్పటికీ తమ ఉద్యమం ఆగిపోదని, మరింత బలపడుతుందనే సందేశాన్ని మాత్రం అది ఇచ్చింది. ఒకవేళ భారతదేశం డిమాండ్ చేస్తున్నట్లుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి అప్పగించడంతోపాటుగా అటు బలూచిస్థాన్‌ను కూడా కోల్పోవలసి వచ్చినట్లయితే పాక్ ముక్కలయినట్లేనని చెప్పాలి. తమ హక్కులకోసం బలూచీలు చేస్తున్న పోరాటం న్యాయమైనదే అయినప్పటికీ వారు ఎంచుకున్న మార్గం అంత సులువైనది, ఇప్పటికిప్పుడు నెరవేరేది మాత్రం కాదనేది రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం. ఒకవేళ తిరుగుబాటుదారులు తమ పోరాటంలో విజయం సాధించడమే జరిగితే దక్షిణాసియా భౌగోళిక స్వరూపమే మారిపోవడం ఖాయం.

# 'విరమణ'పై విమర్శల జడివాన




భారత్– పాకిస్తాన్ మధ్య ఇటీవల సైనిక ఉద్రిక్తతలు, మే 10, 2025న కాల్పుల విరమణతో ముగిసినప్పటికీ ఈ నిర్ణయం చుట్టూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్రచర్చలు జరుగుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసి, స్పష్టమైన సైనిక ఆధిపత్యం చాటిన భారత్, విజయం సాధించే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్న సమయంలో కాల్పుల విరమణకు అంగీకరించడం వివాదాస్పదమైంది. ఈ నిర్ణయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనవసర జోక్యం, ఆయన చేసిన అసందర్భ వ్యాఖ్యలు భారత ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శల తాకిడికి దారితీశాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత సైన్యం అసాధారణ పటిమతో ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. పాకిస్థాన్ యుద్ధ సామర్థ్యాన్ని గణనీయంగా దెబ్బతీసిన ఈ ఆపరేషన్, భారత్‌ను ఆధిపత్య స్థానంలో నిలిపింది. పాక్ వైమానిక స్థావరాలు, రాడార్ స్టేషన్లు, మిస్సైళ్లు నాశనమయ్యాయి. ఈ నేపథ్యంలో మోడీ సర్కార్ అనూహ్యంగా కాల్పుల విరమణకు అంగీకరించడం ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో కాల్పుల విరమణను తానే సాధించానని, భారత్ పాక్‌లు తన మాట విన్నాయని పదే పదే ప్రకటించడం ప్రధాని మోడీ ఇమేజ్‌ను నవ్వులపాలు చేసింది. భారత విదేశాంగ విధానాన్ని ప్రశ్నార్థకం చేసింది. ఈ వ్యాఖ్యలు, 1972 సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించేలా మూడో పక్షజోక్యాన్ని సూచిస్తాయని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ మీడియాలో మోడీ నిర్ణయం బలహీనతగా చిత్రీకరించబడుతోంది. అంతర్జాతీయంగా బిబిసి, ఒన్ న్యూస్ బిడి వంటి సంస్థలు ట్రంప్ మధ్యవర్తిత్వం భారత్‌ను ఇరకాటంలోకి నెట్టిందని విశ్లేషించాయి. ట్రంప్ కశ్మీర్ సమస్యలో మధ్యవర్తిత్వం ప్రతిపాదించడం, భారత్ ముఖ్యంగా భారత ప్రధాన మంత్రి హోదాలో దాన్ని దృఢంగా, స్పష్టంగా తిరస్కరించి మాట్లాడలేకపోవడం విమర్శలను మరింత తీవ్రతరం చేసింది. సోషల్ మీడియాలో నెటిజన్లు మోడీ నిర్ణయం భారత ఇమేజ్‌ను దెబ్బతీసిందని, బిజెపి (మోడీ) అమెరికా (ట్రంప్) ఒత్తిడికి తలొగ్గినట్లేనని, భారత ప్రతిష్ఠను దిగజార్చేలా మోడీ మోకరిల్లటం భారత ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. భారత సైనిక వీరోచిత పోరాటాన్ని మసక బారేలా ఈ అర్ధంతర యుద్ధవిరమణ నిర్ణయం నీరుగార్చింది. బిజెపి, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ వంటి సంస్థల నుంచి, వ్యక్తిగతంగా మోడీ అభిమానులు నుండి కూడా ఈ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. మొత్తానికి ఈ నిర్ణయంపై భారత దేశంలో ఏ వర్గమూ సమర్థించేలా లేదు. చావుదెబ్బ తిన్న పాకిస్తాన్ ప్రజలు ఉత్సాహంగా వీధుల్లో ఊరేగింపు చేసుకుంటున్నారు. అన్ని విధాలా మన సైనికులు పైచేయి సాధించినా ఈ నిర్ణయంతో ప్రజల్లో నిరాశ, నిస్పృహ, నిస్సత్తువ ఆవరించింది. బిజెపి, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ వంటి సంస్థల నుంచి కూడా అసంతృప్తి స్వరాలు ఉచ్ఛస్థాయిలో వినిపిస్తున్నాయి. ఈ సంస్థలు దీర్ఘకాలంగా ఉగ్రవాదంపై, పాకిస్థాన్‌పై గట్టి వ్యతిరేక వైఖరిని కలిగి ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్‌ను జాతీయ గర్వంగా కొనియాడిన ఈ సంస్థలు, కాల్పుల విరమణ నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాయి. సోషల్ మీడియాలో బిజెపి అనుకూల ఖాతాల (గోది మీడియా) నుండి 'మోడీ నిర్ణయాన్ని' తక్కువ స్వర స్థాయిలో సమర్థిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ కార్యకర్తలు ఈ నిర్ణయం జాతీయవాద భావనలకు విరుద్ధమని భావిస్తున్నారు. తమ అధికార పత్రికలో కూడా ఇదే భావం వ్యక్తం చేశారు. మోడీ నిర్ణయం వెనుక దౌత్యపరమైన ఒత్తిళ్లు, ఆర్థిక సంబంధాలు, అంతర్జాతీయ ఒప్పందాలు కారణమై ఉండవచ్చు. ట్రంప్ వాణిజ్య బెదిరింపులు, అమెరికాతో వ్యాపార సంబంధాలు ఈ నిర్ణయంలో కీలక పాత్ర పోషించాయి అని విశ్లేషకులు అంటున్నారు. అయితే, ఈ నిర్ణయం సైనిక విజయాన్ని దౌత్యపరమైన రాజీగా మార్చిందని, భారత్ బలమైన స్థితిని చేజేతులా వదులుకుందని విమర్శలు వస్తున్నాయి.

మోడీ తన ప్రసంగంలో ఉగ్రవాదంపై గట్టి వైఖరిని పునరుద్ఘాటించినప్పటికీ ట్రంప్ జోక్యాన్ని స్పష్టంగా తోసిపుచ్చలేకపోవడం విమర్శలకు ఆజ్యం పోసింది. ఈ సంఘటన భారత విదేశాంగ విధానంలో కీలక చర్చను రేకెత్తించింది. సిమ్లా ఒప్పందం స్ఫూర్తిని కాపాడుకోవడం, అంతర్జాతీయ ఒత్తిళ్లను సమతుల్యం చేయడం భారత్‌కు సవాలుగా మారింది. మోడీ నిర్ణయం దీర్ఘకాలంలో శాంతిని, స్థిరత్వాన్ని తెస్తుందా? లేక దేశ ప్రతిష్ఠకు బలహీనతగా మిగిలిపోతుందా అనేది సమయమే నిర్ణయిస్తుంది. అప్పటివరకు, ఈ విమర్శలు భారత రాజకీయ, సామాజిక వాతావరణంలో తీవ్ర చర్చనీయాంశంగా కొనసాగుతాయి.

# సిఎం స్థానంలో అక్రమాలను ప్రోత్సహించడం సమంజసమా?: జగన్



అమరావతి: టిడిపికి బలం లేకున్నా ఉప ఎన్నికల్లో గెలిచినట్టు ప్రకటించుకుంటున్నారని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. నరసరావుపేట, కారంపూడిలో గెలిచామని ప్రకటించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా జగన్ మీడియాతో మాట్లాడుతూ..కుప్పం మొదలు ఎక్కడ చూసినా ఇలాంటి పరిస్థితని, రామగిరి ఉప ఎన్నికలో అరాచకాలకు అంతులేదని మండిపడ్డారు. సిఎం స్థానంలో అక్రమాలను ప్రోత్సహించడం సమంజసమా?నని జగన్ ప్రశ్నించారు. పోలీసులను పెట్టి వైఎస్ఆర్ సిపి సభ్యులను బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యలమంచిలిలో తమ పార్టీ గట్టిగా నిలబడి గెలిచామని చెప్పారు. ఏ ప్రభుత్వంపైనైనా వ్యతిరేకత రావాలంటే సమయం పడుతుందని, కూటమి ప్రభుత్వంపై నెలల్లోనే విపరీతమైన వ్యతిరేకత ఉందని తెలియజేశారు. తనకన్నా ఎక్కువ చేస్తానని చంద్రబాబు హామి ఇచ్చారని, జగన్ ఇచ్చేవన్నీ ఇస్తాను, అంతకంటే ఎక్కువ ఇస్తానన్నారని పేర్కొన్నారు. కానీ వాటన్నింటినీ తుంగలో తొక్కారని ఎద్దేవా చేశారు. "మన ప్రభుత్వంలో మేనిఫెస్టోతో గడప గడపకూ కార్యక్రమం కింద ప్రతి ఇంటికి వెళ్లాము. మనం చేసిన మంచి ఎక్కడికీ పోదు." అని అన్నారు. 10 శాతం ప్రజలు చంద్రబాబు ఏదో చేస్తారని నమ్మారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రభుత్వాన్ని ఫుట్బాల్ లా తంతారని ధ్వజమెత్తారు. హామీల అమలుపై గట్టిగా నిలదీస్తారనే భయం వారికి ఉందని, మాట ఇవ్వడమంటే వెన్ను పోటని బాబు నిరూపించారని విమర్శించారు. పేదవాడి వైద్యం గురించి ఆలోచించే పరిస్థితి లేదని, ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని చెప్పారు. రూ.3600 కోట్లు పెండింగ్ లో పెట్టారని, ఆరోగ్య ఆసరాలను పూర్తిగా ఎత్తివేశారని అన్నారు. వైద్యం కోసం అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడిందని జగన్ స్పష్టం చేశారు.

# హిందూ-ముస్లిం రాజకీయాలే.. అన్ని సమస్యలకు మూల కారణం: కెజ్రీవాల్



న్యూఢిల్లీ: గత 75 సంవత్సరాలుగా ప్రధాన పొలిటికల్ పార్టీలు ఆచరిస్తున్న హిందూ-ముస్లిం రాజకీయాలే దేశంలోని అన్ని సమస్యలకు మూల కారణమని ఢిల్లీ మాజీ సిఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. మంగళవారం పార్టీ విద్యార్థి విభాగం- అసోసియేషన్ ఆఫ్ స్టూడెంట్స్ ఫర్ ఆల్టర్నేటివ్ పాలిటిక్స్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. "మన దేశం చాలా సమస్యలతో సతమతమవుతోంది. ప్రజలకు ఆహారం, విద్య అందుబాటులో లేదు. ఇలా ఎందుకు జరుగుతోంది?.. ఎందుకంటే బిజెపి, కాంగ్రెస్, ఇతర పార్టీలు గత 75 సంవత్సరాలుగా రాజకీయాల్లో మాత్రమే మునిగిపోయాయి" అని విమర్శించారు. "ఈ పార్టీలు మన పాఠశాల పిల్లలకు హిందూ-ముస్లిం గురించి మాత్రమే బోధిస్తున్నాయి. మన దేశంలో సమస్యలకు ఇదే మూల కారణం" అని ఆయన అన్నారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం.. దేశ రాజధానిలో విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు. నగరంలో సుదీర్ఘ విద్యుత్ కోతలపై ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. "ఇప్పుడు ఢిల్లీలో మూడు నుండి నాలుగు గంటల పాటు విద్యుత్ కోతలు ఉన్నాయి. ఇలా గతంలో జరగలేదు. మూడు నెలల్లోనే, వాళ్లు(బిజెపి) ఢిల్లీలో విద్యను నాశనం చేయడం ప్రారంభించారు" అని ఆయన మండిపడ్డారు. ఆప్ పదేళ్ల పాలనలో ప్రైవేట్ పాఠశాల మాఫియా ఫీజులు పెంచడానికి అనుమతించలేదని ఆయన చెప్పారు. ఎన్నికలను పూర్తి నిజాయితీతో ఎదుర్కోవచ్చని ఆప్ నిరూపించిందని కేజ్రీవాల్ అన్నారు. ASAP గురించి మాట్లాడుతూ.. ఫోరం కింద దేశవ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో విద్యార్థి సాంస్కృతిక బృందాలు ఏర్పడతాయని ఆయన చెప్పారు.

# తిరువూరు మున్సిపల్ ఎన్నిక హైకోర్టు కీలక ఆదేశాలు




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్ టిఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ ఎన్నికపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్ కౌన్సిలర్లకు అరగంటలో భద్రతా ఏర్పాట్లు చేయాలని హైకోర్టు ఆదేశించింది. డిసిపి స్థాయి అధికారితో కౌన్సిలర్లకు భద్రత కల్పించాలని వివరించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు భద్రత కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోర్టుకు విన్నవించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పోలీసులు పాటించడం లేదని కోర్టుకు న్యాయవాదులు తెలిపారు. తక్షణమే ప్రశాంత ఎన్నికలకు చర్యలు చేపట్టాలని హైకోర్టు తెలిపింది. మంగళవారం ఉదయం నుండి తిరువూరులో టిడిపి శ్రేణులు అరాచకం సృష్టిస్తున్నాయి. వైసిపి కౌన్సిలర్లను ఎన్నికలకు రాకుండా అడ్డుకోవడానికి టిడిపి కుట్రలు చేస్తోందని వైసిపి ఆరోపణలు చేస్తుంది. వైసిపి కౌన్సిలర్లపై దాడి చేయడానికి టిడిపి కుట్రలు పన్నుతోందన్నారు. తిరువూరు నగర పంచాయతీ కి సంబంధించి మొత్తం 20 మంది కౌన్సిలర్లులకు ఓటు హక్కు ఉండగా ఎక్స్ అఫీషియల్ హోదాలో ఎమ్మెల్యే ఓటుతో కలిపి మొత్తం 21 ఓట్లు ఉన్నాయి. టిడిపికి ముగ్గురు కౌన్సిలర్లు ఉండగా, వైసిపికి చెందిన కౌన్సిలర్లలో కాకర్లమూడి సుందర్ కుమార్, పసుపులేటి శరత్ బాబు తెదేపాలో చేరారు. మరో ఇద్దరు వైసిపి కౌన్సిలర్లు దారా పద్మా నీలిమ, గతం కస్తూరిబాయి కూడా తెలుగుదేశం పార్టీకి బయట నుండి మద్దతు ఇస్తున్నట్టు సమాచారం. దీంతో టిడిపి 9, వైసిపికి 12 ఓట్లు ఉన్నాయి. వైసిపికి చెందిన కౌన్సిలర్ రమాదేవి విదేశాల్లో ఉండడంతో వైసిపి బలం 11కి పడిపోయినట్టు సమాచారం.

# గుడ్ న్యూస్.. మెట్రో చార్జీలు తగ్గింపు



హైదరాబాద్: నగర వాసులకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గుడ్ న్యూస్ చెప్పింది. ఇటీవల మెట్రో చార్జీలను భారీగా పెంచిన యాజమాన్యం కాస్త దిగొచ్చింది. తాజాగా మెట్రో రైలు సంస్థ టికెట్ ధరలను సవరించింది. మంగళవారం మెట్రో చార్జీలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలపై 10 శాతం చార్జీలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తగ్గించిన టికెట్ ధరలను మే 24వ తేదీ నుండి అమలులోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది. కాగా, ఇటీవల కనిష్టంగా ఉన్న రూ.10 టికెట్ ధరను 12 రూపాయలకు పెంచింది. గరిష్టంగా ఉన్న 60 రూపాయల టికెట్ ధరను 75 రూపాయలకు పెంచిన సంగతి తెలిసిందే.

# గజ రాజులకూ పేర్లుంటాయ్

## ఏనుగులూ పేర్లతో పిలుచుకుంటాయని గుర్తించిన శాస్త్రవేత్తలు
## ప్రత్యేక శబ్దంతో తమ గుంపులోని ఏనుగులకు సిగ్నల్స్
## మనుషుల మాదిరిగానే ఏనుగులకు ప్రత్యేక భాష ఉన్నట్టు గుర్తింపు
## అమెరికాలోని కొలరాడో యూనివర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి



అమరావతి: మనం ఒకరినొకరు పేర్లతో పిలుచుకోవడం సహజం. ఇలా పేర్లు పెట్టుకుని సంబోధించుకోవడానికి మాట్లాడటం రావాలి. అందుకు ఓ భాష కూడా కావాలి. అది మనుషులకు మాత్రమే సాధ్యమనే భావన నిన్నమొన్నటి వరకు భావించేవారు. కానీ.. కొన్ని రకాల వన్యప్రాణులు కూడా మాట్లాడుకుంటాయని.. వాటికి కూడా భాష ఉంటుందని వివిధ పరిశోధనల్లో తేలింది. ఇప్పుడు అలా మాట్లాడుకునే వన్య ప్రాణుల్లో ఏనుగులు కూడా ఉన్నాయని తాజాగా గుర్తించారు. అడవుల్లో జీవించే ఏనుగులు పేర్లతో పిలుచుకుంటాయని తేలింది. అమెరికాలోని కొలరాడో యూనివర్సిటీకి చెందిన రీసెర్చర్ మైకేల్ బార్టో నేతృత్వంలోని బృందం కెన్యాలోని ఆఫ్రికన్ ఏనుగులపై జరిపిన అధ్యయనంలో ఈ విషయం తేలింది. నేచర్ ఎకాలజీ అండ్ ఎవల్యూషన్ జర్నల్‌లో ఈ అధ్యయనం ప్రచురితమైంది. ఏనుగులు చేసే రకరకాల శబ్దాలను శాస్త్రవేత్తలు రికార్డు చేసి వాటి ప్రవర్తనను గమనించారు. అవి తమ గుంపులోని ఇతర ఏనుగులను గుర్తించడానికి ప్రత్యేకమైన, తక్కువ ఫ్రీక్వెన్సీ గల శబ్దాలను (ఇన్‌ఫ్రా సౌండ్) ఉపయోగిస్తాయని కనుగొన్నారు. ఈ శబ్దాలు మనం పేర్లుగా భావించే వాటితో సమానమని తేలింది. ఒక ఏనుగు తన సమూహంలోని మరో ఏనుగును పిలవాలనుకుంటే ఒక నిర్దిష్టమైన శబ్దాన్ని చేస్తుంది. అది ఆ ఏనుగు మాట్లాడాలనుకున్న మరో ఏనుగుకు మాత్రమే సంబంధించిన శబ్దం అని స్పష్టమైంది. ఒక్కో ఏనుగుకు ఒక్కో ప్రత్యేకమైన శబ్దం ఉంది. ఈ శబ్దాలు కామన్‌గా ఇతర అన్ని జంతువులు ఒకే రకంగా చేసేలా లేకపోవడం ఈ పరిశోధనలో గుర్తించిన కీలకమైన అంశం.

ఏఐ టెక్నాలజీతో శబ్దాల విశ్లేషణ

శాస్త్రవేత్తలు ఏఐ టెక్నాలజీని ఉపయోగించి ఏనుగుల శబ్దాలను విశ్లేషించారు. పరిశోధకులు ఒక గుంపులోని ఏనుగులను గుర్తించేందుకు పేర్లు పెట్టారు. అందులో ఒక ఏనుగుకు 'మాంబా' అని పేరు పెట్టి దాన్ని నిరంతరం గమనించారు. 'మాంబా' ఒక నది దగ్గర నీళ్లు తాగుతుండగా, గుంపులోని మరో ఏనుగు దాన్ని పిలవడానికి ఒక ప్రత్యేకమైన గుండ్రని శబ్దాన్ని చేసింది. ఆశ్చర్యకరంగా 'మాంబా' మాత్రమే ఆ శబ్దానికి స్పందించి తల ఎత్తి ఆ దిశగా చూసింది. మిగతా ఏనుగులు ఆ శబ్దాన్ని పట్టించుకోలేదు. దీనిద్వారా ఏనుగులు వ్యక్తిగత పేర్లను ఉపయో గిస్తాయని నిర్ధారణ అయింది.

అసాధారణ మేధస్సు గజరాజుల సొంతం

సాధారణంగా అడవి జంతువులు ఒకే రకమైన అరుపులు, శబ్దాల ద్వారా సంభాషించుకుంటాయి. ఈ శబ్దాలన్నీ కామన్‌గా ఉంటాయి. ప్రత్యేకంగా ఒక్కో దానికి ఒక్కో రకమైన శబ్దాలు ఉండవు. కానీ.. ఏనుగులు ప్రత్యేకంగా మనుషుల మాదిరిగానే సంభాషించుకునేలా శబ్దాలు చేసుకోవడం కొత్త విషయం. అవి ఒక శబ్దాన్ని చేయడంతోపాటు అది ఎవరు చేశారో, ఎవరి కోసం చేశాయో కూడా గుర్తించగలుగుతున్నాయి. అంటే వాటికి బుద్ధితో ఆలోచించే సామర్థ్యం ఉన్నట్టు స్పష్టమైంది. ఏనుగులు బలమైనవే కాదు.. అసాధారణమైన మేధస్సు కలిగిన సామాజిక జీవులని తాజా అధ్యయనంలో వెల్లడైంది.

డాల్ఫిన్లు, చిలుకలకు ప్రత్యేక భాష

ఇప్పటివరకు డాల్ఫిన్లు, చిలుకలు ఒకదాన్ని ఒకటి గుర్తించడానికి శబ్దాలను చేస్తాయని భావించేవారు. ఒక డాల్ఫిన్ తన సమూహంలోని మరో డాల్ఫిన్ చేసే స్వరాన్ని అనుకరించి దాన్ని పిలుస్తుంది. కానీ.. ఏనుగులు ప్రత్యేకమైన శబ్దాలను ఉపయోగిస్తుండటం.. అవి మనుషుల సంభాషణ పద్ధతికి చాలా దగ్గరగా ఉండటంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఏనుగులు తమ సమూహంలో ఉన్న ఇతర ఏనుగులతో బలమైన బంధాలను ఏర్పర్చుకుంటాయి. కలిసి ప్రయాణించడం, కలిసి ఆహారం సేకరించడం, శత్రువుల నుండి ఒకదానిని మరొకటి రక్షించుకోవడం ద్వారా తమ బంధాన్ని మరింత దృఢంగా మార్చుకుంటాయి. అయితే వాటికి ఒక శబ్దాల భాష ఉన్నట్టు తాజాగా బయటపడటంతో అవి మనుషులతో చాలా దగ్గరగా ఉన్నట్టు తేలింది. 'ఏనుగులు మనం ఊహించిన దానికంటే ఎక్కువ సంక్లిష్టతను కలిగి ఉన్నాయి. వాటి సామాజిక నిర్మాణం, సంభాషణ పద్ధతులు మనుషులతో సమానంగా ఉన్నాయి' అని ఈ అధ్యయనంలో పాల్గొన్న ఒక శాస్త్రవేత్త తెలిపారు.

# బాలికల విద్యకు ప్రేమ్‌జీ చేయూత

మనదేశంలో ఆడపిల్లలు చదువుకోవాలంటే ప్రధాన సమస్య డబ్బు. ప్రాథమిక విద్య పూర్తి కాగానే.. ఆర్థిక స్థోమత లేక, పెళ్లీడు రాగానే పెళ్లిచేసి పంపించేస్తే సరిపోతుందని.. ఆడపిల్లల తల్లిదండ్రులు ఆలోచిస్తుంటారు. ఈ నేపథ్యంలో బాలికల ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టాయి. అయినా ఇప్పటికీ లక్షల మంది బాలికలు బడికి పోవడం లేదు. అలాంటి అమ్మాయిల ఉన్నత విద్యకు చేయూత ఇచ్చేందుకు అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ముందుకొచ్చింది. వచ్చే మూడేళ్లలో ఏటా రూ.750 కోట్ల చొప్పున బాలికల కాలేజీ చదువుల కోసం భారీ ఎత్తున రూ.2,250 కోట్లు వెచ్చించనుంది.

## అజిమ్ ప్రేమ్ జీ..

దేశంలోని అపర కుబేరుల్లో ఒకరు. ఆయన స్థాపించిన విప్రో కంపెనీ అంటే విలువలకు పెట్టిందిపేరు. అజిమ్ ప్రేమ్‌జీ అనగానే దాతృత్వం గుర్తుకొస్తుంది. 2019లో విప్రో కంపెనీలో తన వాటా 7.6 బిలియన్ డాలర్లను తన అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థకు ఇస్తున్నట్టు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. 2023 జనవరి వరకు సేవా కార్యక్రమాల ద్వారా రూ.2,40,000 కోట్లు ఖర్చు చేసినట్లు అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ వెల్లడించింది. కరోనా సమయంలో ఆక్సిజన్ బెడ్లు, ఐసీయూ బెడ్లు, ఇతర సాయం కోసం సుమారు రూ.2,000 కోట్లు ఖర్చు చేశారు. కర్ణాటకలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు 2024 నుంచి.. వారంలో నాలుగు రోజులు ఉచితంగా కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారు. దీనిద్వారా 55 లక్షల విద్యార్థులకు గుడ్లు అందించేందుకు ఏడాదికి రూ.800 కోట్ల వ్యయం చేస్తున్నారు. చెప్పుకొంటూ పోతే ఈ జాబితా పెద్దదే. ఇంత దొడ్డ మనసున్న ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఇప్పుడు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

## 2.5 లక్షల మందికి..

అజిమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ పథకం ద్వారా ఎంపికైన మొత్తం 2,50,000 మంది అమ్మాయిలకు సంవత్సరానికి రూ.30వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తారు. అంటే సంవత్సరానికి రూ.750 కోట్లు.. మూడేళ్లకు రూ.2250 కోట్లు మేర బాలికల ఉన్నత విద్య



కోసం అజిమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ వెచ్చించనుంది. తద్వారా దేశంలోలాభాపేక్షలేని సంస్థ ద్వారా అమలవుతున్న భారీ ప్రత్యక్ష నగదు బదిలీ పథకం (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ స్కీమ్ - డీబీటీ) గా ఇది నిలవనుంది.

## అజిమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, 12వ తరగతి పూర్తి చేసుకున్న అమ్మాయిలు అజిమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. గుర్తింపు పొందిన ప్రభుత్వ లేదా ప్రైవేట్ కాలేజీ లేదా యూనివర్సిటీలో రెగ్యులర్ డిగ్రీ లేదా డిప్లొమా కోర్సుల్లో చేరిన అమ్మాయిలు కూడా దరఖాస్తుకు అర్హులే. ఇలా ఆయా కోర్సులో చేరి స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థినులకు కోర్సు పూర్తయ్యే వరకూ ఏటా రూ.30వేల ఉపకారవేతనం అందుతుంది. ఇలా మూడేళ్ల డిగ్రీ లేదా డిప్లొమా కోర్సు పూర్తి చేసుకునే వరకూ ప్రతి విద్యార్థినికి మొత్తం రూ.90వేల ఉపకార వేతనం లభిస్తుంది. ప్రతి ఏటా సెప్టెంబర్‌లో ఈ స్కాలర్‌షిప్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందుకు అవసరమైన పత్రాలు.. పదో తరగతి, 12వ తరగతి మార్కుల పత్రాలు, డిగ్రీ లేదా డిప్లొమా కాలేజీలో అడ్మిషన్ లెటర్/బోనఫైడ్ సర్టిఫికెట్, ఫీజు రిసిప్ట్, పాస్‌పోర్టు ఫొటోలు.

## ప్రేమ్‌జీ ఫౌండేషన్

విప్రో సంస్థ వ్యవస్థాపకుడు అజిమ్ ప్రేమ్‌జీ ఆధ్వర్యంలో 2001లో అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఏర్పాటైంది. దాతృత్వ కార్యక్రమాల ద్వారా దేశాభివృద్ధిలో పాల్పంచుకోవాలనే ఆశయంతో ఏర్పాటు చేసిన లాభాపేక్షలేని సంస్థ ఇది. ఈ ఫౌండేషన్ ద్వారా విద్య, ఆరోగ్యం, జీవనోపాధి తదితర రంగాల్లో సేవలు అందిస్తున్నారు. 'బాలికలు ఉన్నత విద్యను పూర్తి చేసుకోవాలనే లక్ష్యంతో అజిమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌లను ఇస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ పూర్తిచేసిన బాలికలు ఈ ఉపకార వేతనం పొందేందుకు అర్హులు. ఉన్నత విద్యను పూర్తిచేసుకోవడంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే బాలికలు అజిమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్ ద్వారా వారు తమ చదువులు కొనసాగిస్తారని ఆశిస్తున్నాం. ఉన్నత విద్యావంతులైన మహిళలు తమ జీవితంలో సాధికారతను సాధించగలరు'అంటారు అజిమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సీఈవో అనురాగ్ బెహరా.

## ఉన్నత విద్యలో చేరేది మూడొంతులే..

ఆర్థిక సర్వే 2024-25 ప్రకారం దేశంలోని 15 లక్షల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 25 కోట్ల మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో సగం మంది ప్రభుత్వ బడుల్లోనే చదువుకుంటున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో సగటు చేరికలు (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) 93 శాతం ఉంటే.. ఆరో తరగతికి వచ్చేసరికి అది 77.4 శాతానికి డిపోతోంది. కేవలం 56.2 శాతం మంది మాత్రమే 12వ తరగతి పూర్తి చేసుకోగలుగుతున్నారు. అంతేకాకుండా కేవలం మూడోవంతు మంది కాలేజీ విద్యలో చేరుతున్నారు. కాలేజీల్లో చేరే వారిలో బాలురతో పోలిస్తే బాలికల సంఖ్య తక్కువే. దీనికి ప్రధాన కారణం ఆర్థిక వెనుకబాటుతనం.

## విప్రో సామాజిక బాధ్యత

విప్రో కంపెనీ సామాజిక బాధ్యత కింద భారీ ఎత్తున అనేక కార్యక్రమాలు చేపడుతోంది. విప్రో వార్షిక నివేదిక 2023-24 ప్రకారం.. 2023-24లో ఆ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమాల కోసం రూ.17,900 కోట్లకుపైగా వెచ్చించింది. దీనిద్వారా విద్య, వైద్యం, డిజిటల్ స్కిల్లింగ్ వంటి అంశాల్లో 17 దేశాల్లోని 45 లక్షల మందికి లబ్ధి చేకూరింది. 2020-21 నుంచి 2023-24 వరకు.. మనదేశంలో విద్యా రంగంలో 29 లక్షల మంది లబ్ధి పొందారు. ఇదే సమయంలో.. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విభాగంలో 38 లక్షల మందికి ప్రయోజనం చేకూరింది.

# కీలెరిగి వాతపెట్టిన 'సుప్రీం'



యుద్ధంలో ఆయుధాలు మాత్రమే నిర్ణయాత్మక శక్తి కాదు... కోట్లాది పౌరులు ఒక్కటై వినిపించే స్వరం కూడా. కానీ పాకిస్తాన్‌తో తీవ్ర ఘర్షణలు తలెత్తిన వేళ ఆ సమష్టి స్వరానికి అవరోధం కల్పించేలా, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడి మన నేతల్లో కొందరు దేశాన్ని దిగ్భ్రమ పరిచారు. బహుశా అందుకే కావొచ్చు, కల్నల్ సోఫియా ఖురేషిపై నోరు పారేసుకున్న మధ్యప్రదేశ్ మంత్రి కన్వర్ విజయ్ షా క్షమాపణను సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తోసిపుచ్చింది. ఈ విషయంలో ఆయనపై దాఖలైన ఎఫ్ఐఆర్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసి ఈ నెల 28కల్లా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఐపీఎస్ అధికారులతో ఏర్పాటయ్యే ఈ బృందంలో ఒక మహిళా అధికారి ఉండాలనీ, దానికి ఐజీ ర్యాంకుకు తక్కువకాని అధికారి సారథ్యం వహించాలనీ ఉత్తర్వులిచ్చింది. ఈ తరహా విద్వేష ప్రసంగాలు బీజేపీ నేతల నుంచి మాత్రమే కాదు, కొందరు విపక్ష నేతల నుంచీ వినిపించాయి. చిత్రమేమంటే ఎక్కడా, ఎవరిపైనా పోలీసులు కేసులు పెట్ట లేదు, చర్యలకు సిద్ధపడలేదు. కానీ సాధారణ పౌరులు చిన్నపాటి భిన్నస్వరం వినిపించినా విరు చుకుపడ్డారు. ఇందుకు అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ ఉదంతమే నిదర్శనం. కల్నల్ సోఫియాను కీర్తిస్తున్న బీజేపీ శ్రేణులు విద్వేష ప్రచారానికి బలవుతున్నవారిని ఎందుకు పట్టించుకో రని ఆయన ప్రశ్నించారు. సైన్యాన్నిగానీ, ఆ మహిళా అధికారుల్నిగానీ కించపరచలేదని, బాహాటంగా కనిపిస్తున్న ద్వంద్వ నీతిని ఎత్తిచూపటమే తన ఉద్దేశమని చెప్పినా ఆయన్ను అరెస్టు చేశారు. విజయ్ షాపై మధ్యప్రదేశ్ పోలీసులు సొంతంగా కేసు నమోదు చేయలేదు. అక్కడి హైకోర్టు సుమోటోగా తీసుకుని తక్షణం ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని పోలీసుల్ని ఆదేశించింది. ఆ తర్వాతైనా పోలీసులు సక్రమంగా చర్యలు తీసుకున్నది లేదు. ఎఫ్ఐఆర్ వాలకం గమనించిన హైకోర్టు చీవాట్లు పెట్టాకే వారికి జ్ఞానోదయమైంది. విజయ్ షా కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి కాదు. రాష్ట్రంలోని ఎస్టీ నియోజకవర్గం హర్సూద్ నుంచి ఇప్పటికి 8 దఫాలుగా ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వస్తున్నారు. మంత్రిగా పని చేస్తున్నారు. సంక్షోభ సమయాల్లో సంయమనం పాటించటం చాలా అవసరం. బాధ్యతాయుత స్థానాల్లో వున్నవారు ఆ సంగతి మరిచిపోతున్నారు. విజయ్ షా వ్యాఖ్యల సంగతే తీసుకుంటే ఆయన అన్నది కేవలం కల్నల్ సోఫియా ఖురేషిని మాత్రమే కాదు... ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తావన చేసి ఆయనపై సంశయాలు రేకెత్తించే విధంగా మాట్లాడారు. యుద్ధానికి సంబంధించిన వివరాలను వెల్లడించటానికి నియమించిన ఇద్దరు మహిళా ప్రతినిధుల్లో ఒకరైన కల్నల్ సోఫియాను 'ఉగ్ర వాదుల సోదరి'గా అభివర్ణించారు. ఉగ్రవాదులను ఆ వర్గం చేతే దెబ్బకొట్టించటానికి ప్రధాని ఆమెను తెలివిగా ఎంపిక చేశారన్నట్టు మాట్లాడారు. కల్నల్ సోఫియా నిర్వహించిన మీడియా సమావేశాలను గమనిస్తేనే ఆమె ఎంత సమర్థంగా, చతురతతో ఆ బాధ్యతను నెరవేర్చారో తెలు స్తుంది. గర్వించదగిన నేపథ్యం ఆమెది. దేశంలోని ప్రతి మహిళా స్ఫూర్తిదాయకంగా తీసుకోదగిన చరిత్ర ఆమెది. సైనిక కుటుంబం నుంచి వచ్చి, సైన్యంలో చేరి అందులోని వ్యక్తినే వివాహమాడి ప్రతి స్థాయిలోనూ తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటూ కల్నల్ హోదా వరకూ ఎదిగారు. అటువంటామెను కేవలం ముస్లిం మహిళగా చూశారంటేనే...

విజయ్ షా ఎంత ఉన్మాదపూరితంగా ఆలోచి స్తున్నారో అర్థమవుతోంది. అందుకే ఆయన ప్రసంగం తీరు చూసి దేశం యావత్తూ సిగ్గుపడుతోందని సుప్రీంకోర్టు అనక తప్పలేదు. ఉగ్రస్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా మోదీ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ దేశమంతా ఒక్కటై ఈ కష్టకాలాన్ని అధిగమించటానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. దాని అర్థం, పర మార్థం విజయ్ షాకు కాస్తయినా అర్థం కాలేదని ఆయన చేసిన వ్యాఖ్యలు, అటు తర్వాత క్షమా పణ చెబుతూ చేసిన ప్రకటన గమనిస్తే తెలుస్తుంది. నోరుజారి తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు బేషరతుగా క్షమాపణ చెబుతున్నానంటే బహుశా కోర్టు చీవాట్లతో సరిపెట్టేదేమో! కానీ అందరి నేతల మాదిరే 'ఎవరి మనోభావాలైనా దెబ్బతినివుంటే...' అంటూ రాగం తీయడంతో వివాదంలో మరింత కూరుకుపోయారు. మంత్రి చెప్పిన క్షమాపణలో చిత్తశుద్ధి లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. చేస్తున్నది క్షమించరాని తప్పని ఎటూ తెలియలేదు. కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితోపాటు పార్టీ అధిష్ఠానం సైతం మందలించినా పునరాలోచన కలగలేదు, పరివర్తన రాలేదు. ఇలాంటివారిని నాలుగ్గోడల మధ్య మందలించటం కాదు... పదవి నుంచి సాగనంపివుంటే అలాంటివారికి అదొక హెచ్చరికగా ఉండేది. దేశ ప్రజలు కొనియాడేవారు. కానీ బీజేపీ ఆ పని చేయలేకపోయింది. సమాజ్‌వాదీ నాయకుడు రాంగోపాల్ యాదవ్ సైతం ఈ మాదిరి వ్యాఖ్యలే చేశారు. వైమానిక దళ అధికారులైన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, ఎయిర్ మార్షల్ ఏకే భారతిల కులాల ప్రస్తావన చేశారు. బీజేపీకి కల్నల్ సోఫియా మతం తెలిసిందిగానీ ఈ అధికారులిద్దరూ పీడిత కులాలవారని తెలియదని, లేకుంటే వారిపైనా తప్పుడు వ్యాఖ్యానాలు చేసేవారని అన్నారు. ఈ బాపతు నాయకు లంతా మనుషుల్ని ఎంతసేపూ కులమతాల చట్రాల్లో చూస్తూ వారి సేవలనూ, అంకిత భావాన్నీ, సంకల్ప దీక్షనూ మరుగుపరుస్తారు. దేశభక్తి పేరుతో ఉన్మాదాన్నీ, విద్వేషాన్నీ పెంచి పోషిస్తారు. సుప్రీంకోర్టు స్పందించిన తీరు నేతలందరికీ గుణపాఠం కావాలి. సంక్షోభ కాలాల్లో మాత్రమే కాదు... సాధారణ సమయాల్లోనూ జాగ్రత్తగా మాట్లాడాలని తెలుసుకోవాలి.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com